
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 13 జూలై 2025



రెండు నియోజకవర్గాల్లో సాగు,తాగునీరు అందించే బృహత్తర పథకం అది. పేరు శ్రీఆనం సంజీవరెడ్డి హైలెవెల్ కెనాల్ (సోమశిల హైలెవల్ కెనాల్). 13 ఏళ్ల క్రితం పురుడు పోసుకున్న ఈ పథకం పనులు నేటికీ సా...గుతూనే ఉన్నాయి. గత వైసీపీ హయాంలో నత్తేనయం అనేలా పోటీపడిన పనులు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ అదే తీరున ఉన్నాయి. ఈ ఏడాది సంక్రాంతికల్లా కెనాల్ పనులు ప్రారంభించనున్నట్లు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించి, ఆర్నెల్లు గడిచినా అమలుకు నోచుకోలేదు. ఇందుకు నిధులు మంజూరు కాకపోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. హైలెవల్ కెనాల్ పూర్తయితే ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని 90 వేల ఎకరాలకు సాగునీరు, 2.35 లక్షల మంది దాహార్తి తీరే అవకాశం ఉంది.

హామీ ఇచ్చి..

- ప్రారంభంకాని సోమశిల హైలెవెల్ కెనాల్ పనులు
- బృహత్తర ప్రాజెక్టుకు నిధులే ప్రధాన అడ్డంకి
- పూర్తయితే ఆత్మకూరు, ఉదయగిరి సస్యశ్యామలం

ఆర్నెల్లు అయిందయ్యా !

మర్రిపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల రైతులు దశాబ్దాల కాలంగా చేసిన విన్నపాల ఫలితంగా సోమశిల హైలెవెల్ కెనాల్‌కు 2012లో రూపకల్పన జరిగింది. 90 వేల ఎకరాలకు సాగునీటితోపాటు 2.35 లక్షల మందికి తాగునీరు అందించాలన్న మహోన్నత లక్ష్యంతో శ్రీఆనం సంజీవరెడ్డి హైలెవెల్ కెనాల్ పనులకు ప్రతిపాదనలు జరిగాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆత్మకూరు నియోజకవర్గంలో 63,615 ఎకరాలు, ఉదయగిరి నియోజకవర్గంలో 26,385 ఎకరాలు సాగులోకి వస్తాయి. మొత్తంగా ఆరు మండలాల్లోని 58 గ్రామాల రైతులు లబ్ధిపొందుతారు. 2019లో టీడీపీ అధికారంలోకి వచ్చాక రూ.521.53 కోట్లు కేటాయించడంతో పనుల్లో పరోగతి కనిపించింది. మొదటిదశ పనుల్లో భాగంగా 0.23 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టిన పొంగూరు జలాశయం పనులు ప్రారంభించి 85 శాతం పూర్తయినట్లు అధికారులు ప్రకటించారు. అయితే, రైతుల అవసరాల కోసం దారికి వదిలిన ప్రాంతంలో కట్టలు కలపడంతోపాటు లైనింగ్ పనులు మిగిలిపోయాయి. 0.33 టీఎంసీల సామర్థ్యంతో ఇస్కపల్లి జలాశయ నిర్మాణం చేపట్టి 45 శాతం పనులు పూర్తి చేశామని అధికారులు ప్రకటించారు. పెగళ్లపాడు వద్ద 1 టీఎంసీ సామర్థ్యంతో జలాశయం పనులు 30 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఈ ప్రాజెక్టులో అన్నిటికంటే ప్రధానమైన రిజర్వాయరు పడమటినాయుడుపల్లి. 1 టీఎంసీ సామర్థ్యం కలిగిన ఈ జలనిధి తొలి విడతలో ప్రారంభించాల్సి ఉన్నా ఇప్పటివరకు పనులు చేపట్టలేదు. అందుకు కారణం మజరా గ్రామాల్లో భూ సేకరణ పూర్తికాకపోవటమే.

● మాట నిలుపుకోని జగన్

రెండవ దశ పనులు చేపట్టాలని గత వైసీపీ ప్రభుత్వం 2020, నవంబరు 9న అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంతో తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. 2024 ఎన్నికల నాటికి ఈ పనులు పూర్తి చేయనున్నట్లు అప్పట్లో జగన్ ప్రటించారు. కానీ పనులు పరిశీలిస్తే కంపసముద్రం రిజర్వాయర్ పనులు ప్రారంభమై చెరువు కట్టపనులు 80శాతం మాత్రమే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. అన్నిచోట్లా నిర్మించిన పంపు హౌస్‌కి ఏర్పాటు చేసిన యంత్రాలు తుప్పుపట్టాయి.



పెగళ్లపాడు వద్ద నిర్మించిన పంపు హౌస్ వద్ద తుప్పుపట్టిన యంత్రాలు



అర్ధంతరంగా ఆగిన కంప సముద్రం రిజర్వాయర్ పనులు

● విడుదల కాని నిధులు

ఈ పరిస్థితుల్లో గతేడాది జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావటం, ఆత్మకూరు ఎమ్మెల్యే, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిపై రైతుల ఆశలు చిగురించాయి. కానీ ఏడాది గడిచినా పనుల పురోగతిపై చలనంలేదు. గత ఏడాది డిసెంబరు 10న పొంగూరులో రెవెన్యూ సదస్సుకు వచ్చిన మంత్రి ఆనం పొంగూరు రిజర్వాయర్‌ని పరిశీలించారు. సీఎం చంద్రబాబు సోమశిల జలాశయం పరిశీలనకు వచ్చినప్పుడు త్వరితగతిన పనులు ప్రారంభించాలని, అందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని, ఈ ఏడాది సంక్రాంతికి పనులు ప్రారంభంకానున్నట్లు అప్పట్లో మంత్రి తెలిపారు. కానీ ఇప్పటికి ఆరు నెలలు గడుస్తున్నా పనుల్లో పురోగతి లేదు. ఇందుకు నిధులు మంజూరు కాకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కాగా, ఇటీవల పెగళ్లపాడు రిజర్వాయర్ కింద మునకలో పోతున్న భూముల రైతుల ఖాతాల్లో పరిహారం నగదు జమ అవుతున్నట్లు సమాచారం. ఏదిఏమైనా ఇప్పటివరకు హైలెవల్ కెనాల్ పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

కాలువపై ఎన్నో ఆశలు



ఈ రైతు పేరు కన్నెమరకాల వెంకటేష్. మర్రిపాడు మండలం పెగల్లపాడు గ్రామం. ఈయనకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మెట్టప్రాంతం కావడంతో సోమశిల హైలెవల్ కెనాల్‌పైనే ఆశలు పెట్టుకుని ఉన్నారు. అయితే, వైసీపీ ప్రభుత్వంలో అర్ధంతరంగా పనులు ఆగిపోవటంతో వెంకటేష్ ఆశలు ఆవిరయ్యాయి. కూటమి ప్రభుత్వంలో అయినా పనులు పునఃప్రారంభం అవుతాయని ఆశలు పెట్టుకుని ఉన్నారు.

- కన్నెమరకాల వెంకటేష్, రైతు, మర్రిపాడు

అభివృద్ధి ఆగిపోయింది



భూ సేకరణలో జాప్యం కరణంగా మొదటి దశలో ప్రారంభించాల్సి రిజర్వాయర్ పనులు మా పడమటినాయుడుపల్లిలో చేపట్టలేదు. మా గ్రామం అంతా డ్యామ్ నిర్మాణంలో పోతుండటంతో పునరావాసాలు ఏర్పాటు చేస్తారని ఎదురు చూస్తున్నాం. హైలెవల్ కెనాల్ ప్రకటించినప్పటి నుంచి గ్రామంలో అభివృద్ధి ఆగిపోయింది.

- పీ.శ్రీనివాసులు, పడమటినాయుడుపల్లి

అదే పరిహారమని చెబుతున్నారు



భూములు కోల్పోయిన రైతులకు పరిహారమని ఎప్పటి నుంచో చెబుతున్నారు. ఇంతవరకు అందించలేదు. 12 ఏళ్ల క్రితం ఎకరాకి రూ.8లక్షలు చొప్పున పరిహారాన్ని కేటాయించారు. నేడు కూడా అదే పరిహారాన్ని అందిస్తామంటున్నారు.

- పీ.తిరుపాలయ్య రైతు, పడమటినాయుడుపల్లి, మర్రిపాడు మండలం

మంచినీటి సమస్య పరిష్కారం



హైలెవల్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేసి మంచినీరు అందిస్తారని ఎదురుచూస్తున్నాం. మా మర్రిపాడు మండలంలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండటంతో కిడ్నీ బాధితులు ఎక్కువయ్యారు.కూటమి ప్రభుత్వం చొరవతో అయినా మా ప్రాంతవాసులకు శుద్ధి జలాలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

- పెంచలయ్య, మర్రిపాడువాసి

రెండోరోజు ఉత్సాహంగా
రెవెన్యూ క్రీడలు



చదరంగం పోటీలో తలపడుతున్న రెవెన్యూ ఉద్యోగులు

నెల్లూరు నగరంలోని ఏసీ స్టేడియంలో రెవెన్యూ క్రీడలు రెండోరోజు శనివారం ఉత్సాహంగా సాగాయి. టేబుల్ టెన్నిస్, షటిల్, క్యారమ్స్, బాస్కెట్ బాల్, వాలీబాల్, చెస్, లెమన్ స్పూన్, టగ్‌ఆఫ్‌వార్, లాంగ్ జంప్, హైజంప్ తదితర క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ క్రీడల్లో కలెక్టర్ ఆనంద్ కుమారుడు ఆరుతో కలిసి క్యారమ్స్ ఆడటం చూపరులను ఆకట్టుకుంది. కాగా ఆదివారం పోటీలు ముగియనున్నాయి.

- వివరాలు 8లో

నాకు తెలియదు.. సంబంధం లేదు !

● ఎక్సైజ్ అధికారుల విచారణలో కాకాణి

నెల్లూరు(క్రైం), జూలై 12 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ నిల్వల కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఇందుకూరుపేట ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో కోర్టు ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు కాకాణిని శనివారం కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ను జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాని(డీటీసీ)కి తరలించి ఉదయం ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విచారించారు. తొలిరోజు పలువురు అధికారులు కాకాణిని విచారించారు. ఆయన్ను వారు 30 ప్రశ్నలు అడిగారు. అన్నింటికి కూడా ఆయన 'నాకు తెలియదు... సంబంధం లేదు' అని సమాధానమిచ్చారు. కాగా ఆదివారం కూడా ఆయన్ను ఎక్సైజ్ అధికారులు విచారించనున్నారు.



ఇండోసోల్ బాధిత యానాదులతో మాట్లాడుతున్న కేసీ పెంచలయ్య తదితరులు

కరేడు బాధితులకు
అండగా ఉంటాం

● రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఉలవపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ పరిశ్రమ కోసం అమాయక యానాదుల భూములను లాక్కొనేందుకు ప్రయత్నిస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమంతో ప్రతిఘటిస్తామని రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం ఉమ్మడి జిల్లాల యానాదుల సంఘం ప్రతినిధులతో కరేడులోని పొల్లుగట్టు సంఘం, ఆకుతోట సంఘం, రామకృష్ణాపురం యానాది కాలనీల్లో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా అక్కడివారు మాట్లాడుతూ 'ఏళ్ల తరబడి కరేడు గ్రామస్థులతో కలిసి జీవిస్తున్నాం, యానాదుల భూములు, గృహాలు బలవంతంగా లాక్కుంటారట. మేం ఇంకెక్కడికి వెళ్లం.. ఇక్కడే ఉంటాం' అన్నారు. యానాదుల కాలనీలలో పర్యటించిన వారిలో జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, ప్రకాశం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కొమరిగిరి మాల్యాద్రి, చేవూరి దుర్గా ప్రసాద్, ఇతర నాయకులు ఇండ్ల మల్లి, యాటగిరి ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

● ఏఐబీఎస్పీ మద్దతు

కరేడు ప్రజల పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) నాయకులు తెలిపారు. శనివారం కరేడు గ్రామంలో ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ బక్కా పరంజ్యోతి, నాయకులు పర్యటించి, స్థానికులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి వెంకటస్వామి, ఏపీ గిరిజన సమన్వయ కమిటీ కన్వీనర్ పేరం సత్యం, నాయకులు మిరియం శ్రీనివాసులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేటితో గడువు పూర్తి

- 'అన్నదాత సుఖీభవ'కు ఇప్పటి వరకు 1,93,064 మందికి అర్హత
- ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతుల సంఖ్య 2,095

నెల్లూరు(వ్యవసాయం), జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతు సేవా కేంద్రా(ఆర్ఎస్‌కే)ల్లో అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాను వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉంచారు. ఈ జాబితాలో పేరు లేకపోతే దరఖాస్తు చేసుకునేందుకు ఆదివారం వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. ఈ పథకానికి అర్హత ఉండి పేరు లేకపోతే అందుకు అవసరమైన పత్రాలు ఇవ్వాల్సి ఉంది. అనంతరం అన్నదాత పోర్టల్‌లోని గ్రీవెన్స్ మాడ్యూల్‌లో కూడా ఫిర్యాదు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,93,064 రైతు కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. ఇంకా 2,095 రైతు కుటుంబాలు ఈకేవైసీ నమోదు చేయించుకోవాల్సి ఉంది. వీరంతా దాదాపుగా అందుబాటులో లేరని సమాచారం.

గ్రీవెన్స్ మాడ్యూల్‌లో 1,209 మందికి అర్హత

గ్రీవెన్స్ మాడ్యూల్‌లో 1,409 దరఖాస్తులు రాగా 1,209 మందిని అర్హులుగా నమోదు చేశాం. 198 పెండింగ్‌లో ఉన్నాయి. రెండింటిని రద్దు చేశాం. తహసీల్దారు లాగిన్‌లో 35 దరఖాస్తులు రాగా 14ను ఓకే చేశాం, 18 పెండింగ్‌లో ఉన్నాయి. మూడింటిని రద్దు చేశాం. అర్హులు ఎవరైనా ఉంటే ఆదివారం(నేటి)లోగా ఫిర్యాదు చేయవచ్చు.

- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

సమ్మెలోకి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

● ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో కార్పొరేషన్ అధికారులు

నెల్లూరు(సిటీ), జూలై 12,(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని జిల్లాలోని మున్సిపాలిటీల్లోనూ, నగర కార్పొరేషన్‌లోనూ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు సమ్మెబాట పట్టారు. శనివారం అర్ధరాత్రి (తెల్లవారితే ఆదివారం) నుంచి విధులను బహిష్కరిస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ఉన్నతాధికారులకు సమ్మె నోటీసులు అందచేశారు. ఎన్ఎంసీ కమిషనర్, ఎస్ఈలకు వాట్సాప్ ద్వారా సమాచారాన్ని అందచేశారు. తాగునీటి సరఫరా విభాగంలోని ఫిట్టర్లు, వాల్ ఆపరేటర్లు, వీధి లైట్ల నిర్వహణ సిబ్బంది, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సిబ్బంది తదితరులు 200 మంది వరకు సమ్మెలో పాల్గొంటున్నట్లు ఫెడరేషన్ జిల్లా నాయకులు తెలిపారు. జీతాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అవకాశం కల్పించాలని, పదవీ విమరణ అనంతరం ఆర్థిక ప్రయోజనాలతోపాటు, వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్న డిమాండ్లతో కొన్ని రోజులుగా వీరు ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెబాటపట్టినట్లు వారు తెలిపారు. ఈ విషయమై ఎస్ఈ రామ్మోహన్‌రావును వివరణ కోరగా సమ్మె వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రైవేట్ కార్మికులను రంగంలోకి దింపుతున్నట్లు ఆయన వివరించారు.

మాలకొండ ఆదాయం రూ. 12,45,009

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 12,45,009 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 7,850, కుంకుమార్చన ద్వారా రూ. 20,880, తలనీలాల ద్వారా రూ. 49,625, వాహనపూజల ద్వారా రూ. 5,680, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 3,96,400, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 920, రూము అద్దెల ద్వారా రూ. 33,910, కవర్ల విక్రయం ద్వారా రూ. 11,500, లడ్డూప్రసాదం ద్వారా రూ. 2,57,960, అన్నదానం ద్వారా రూ. 4,60,284 ఆదాయం లభించినట్లు ఆయన తెలిపారు.

● స్వామిని దర్శించుకున్న ప్రకాశం జిల్లా న్యాయాధికారి

మాల్యాద్రి లక్ష్మీనరసింహం స్వామిని శనివారం ఒంగోలు జిల్లా న్యాయాధికారి ఏ. భారతి, రాష్ట్ర పోలీసు అధికారి రవిచంద్ర వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రదాన ఉపఅర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డీసీ చంద్రశేఖర్, ఎస్ఐ మరిదినాయుడు, టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్షకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లు గ్రామాల్లో పర్యటిస్తేనే
మెరుగైన ఫలితాలు

● సమీక్షలో సీసీఎల్ఏ జయలక్ష్మి

నెల్లూరు(హరనాథపురం), జూలై 12(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా, గ్రామాల్లో పర్యటిస్తేనే మెరుగైన ఫలితాలు వస్తాయని భూపరిపాలనాశాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. శనివారంరాత్రి కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల పట్ల తహసీల్దార్లు బాధ్యతాయుతంగా ఉండాలని అన్నారు. రీసర్వే చేపట్టిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంను త్వరగా విడగొట్టి, వ్యక్తిగతంగా పాసుపుస్తకాలు ఇవ్వాలని ఆదేశించారు. జాయింట్ ఎల్‌పీఎంగా నమోదు చేయడం వల్ల పలువురు రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేక పోతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌లో అందే ప్రజల అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. మండలాల వారీగా తహసీల్దార్లతో ఆర్డీవోలు సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు అనూష, వంశీకృష్ణ, పావని, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి, వేదికపై కలెక్టర్ ఆనంద్

● కలెక్టర్ స్వాగతం

రాష్ట్ర భూపరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి (సీసీఎల్ఏ) జయలక్ష్మి శనివారం నెల్లూరు పర్యటనకు వచ్చారు. నగరంలోని ఓ హోటల్‌కు చేరుకున్న ఆమెకు కలెక్టర్ ఆనంద్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో హుస్సేన్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అభ్యాసం

- బాల్యానికి భరోసా ఇచ్చేలా.. చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేలా చర్యలు
- అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక పుస్తకాల పంపిణీ

చేజర్ల, జూలై12 (ఆంధ్రజ్యోతి): బాల్యానికి భరోసా ఇవ్వడంతోపాటు చిన్నారులు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఎదిగేలా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో మార్పులకు శ్రీకారం చుట్టింది. జాతీయ విద్యా విధానం, జాతీయ పాఠ్య ప్రణాళికలో భాగంగా మహిళా,శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నవచేతన, ఆధార్‌శిల అనే రెండు పుస్తకాలను రూపొందించి అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేసింది. వీటిలోని అంశాలను ఆయా కేంద్రాల కార్యకర్తలు, సహాయకులు అమలు చేయడంతోపాటు చిన్నారుల తల్లిదండ్రులకు వివరించాల్సి ఉంది.


● 'నవచేతన'లో ఏముందంటే..

నవచేతన పుస్తకంలో పిల్లల ఎదుగుదల, అభివృద్ధి, పోషణ, ఆరోగ్యం, విద్యాపరమైన అంశాలను పొందుపరిచారు. పసిబిడ్డల పెంపకంలో తల్లి, కుటుంబ సభ్యులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి... వారితో ఎలా ప్రవర్తించాలి... చిట్టి బుర్రలకు అర్థమయ్యేలా ఎలా కబుర్లు, కథలు చెప్పాలి...? అనే విషయాలను ఫొటోలతోసహా ఈ పుస్తకంలో పొందుపరిచారు. చిన్నారికి మూడేళ్ల వయసు వచ్చే వరకు ఏం చేస్తే వారు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యకరంగా పెరుగుతారో కూడా వివరించారు. పిల్లలకు ఏనెలలో ఎలాంటి అంశాలు నేర్పించాలో కూడా వివరిం చారు. ఇందులోని అంశాలపై అంగన్‌వాడీ టీచర్ తమ వద్దకు వచ్చే బాలింతలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

శిక్షణ ఇచ్చి పర్యవేక్షిస్తున్నాం..

ప్రభుత్వం పంపిణీ చేసిన ఈ రెండు పుస్తకాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు అందించాం.వీటిలోని అంశాలపై కార్యకర్తలకు, సహాయకులకు శిక్షణ ఇచ్చాం. ఇకపోతే కేంద్రాల్లో రోజువారీ కార్యక్రమాల అమలు తీరును పర్యవేక్షిస్తున్నాం.

- సునీలత, సీడీపీవో, ఆత్మకూరు



● 'ఆధార్ శిల' లో...

ఆధార్ శిల పుస్తకంలో పిల్లల సమగ్రాభివృద్ధికి అవసరమైన అంశాలను ఆటల ద్వారా అభ్యాసం చేయించడం, సామాజిక నైపుణ్యాలు పెంపొందించేలా అంశాలను రూపొందించారు. అంతేకాక అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు వినోదాత్మకంగా పాఠాలు ఎలా బోధించాలో..? కూడా వివరించారు. పాఠాలు చెప్పే విధానం కూడా మొత్తం ఆటలు ఆడించే ప్రక్రియగా ఉంటుంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 525

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9414
వెండి కిలో ధర	రూ. 115600
వెండి ఒక గ్రాము	రూ.118.60

కొనసాగుతున్న గురుపౌర్ణమి వేడుకలు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 12(ఆంధ్రజ్యోతి) : నగరంలోని గాంధీబొమ్మ షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు కొనసాగుతున్నాయి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి షిరిడీ హారతులు జరిగాయి. ఉదయం 7గంటల నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. సహస్ర నామ పూజలు, హారతులు, మంత్ర పుష్పం పూజలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను మందిరం చైర్మన్ మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి, కొల్లి శ్యామసుందర్‌రెడ్డి, పైడిపాటి సుధాకర్‌రావు, దువ్వూరు జయమ్మ పర్యవేక్షించారు.

న్యూస్ బాక్స్

వాత్సల్యలో అనాథ పిల్లల మధ్య పుట్టినరోజు వేడుకలు

నెల్లూరు(హరనాథపురం), జూలై 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వాత్సల్యలో అనాథ పిల్లల మధ్య శనివారం అత్తివరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ అసిస్టెంట్ సింగమల కుసుమకుమారి తన కుటుంబసభ్యులతో కలిసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. ఆశ్రమ నిర్వహణకు రూ.10వేల ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు, మానవసేవయే మాధవ సేవ నిర్వాహకురాలు అరవ పరిమల, విశ్రాంత ఎస్‌ఐ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు క్రికెట్ పోటీలు

నెల్లూరురూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి) : పండరిభజన, డోలుమాస్టర్లు, హార్మోనిస్టుల కళలకు చెందిన కళాకారులు శనివారం మండలంలోని వెల్లంటి జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. వీటిని కొత్త, పాత వెల్లంటిలకు చెందిన సర్పంచులు లక్ష్మమ్మ, పాదర్తి రాధ, మాజీ ఎంపీటీసీ జనార్దన్‌లు ప్రారంభించారు. కళాకారుల క్రికెట్ పోటీల నిర్వాహకులు ఎర్రయపల్లి పెంచలదాస్, యానదయ్య, శీనయ్యలు మాట్లాడారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

నెల్లూరురూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురం వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాదికి రెండు పర్యాయాలు చొప్పున 2010 నుంచి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేడు ఉదయం 9 నుంచి 1 గంట వరకు జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో శిబిరం జరుగుతుందని, రక్తదాతలు పాల్గొని ప్రాణ దాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగులను సత్కరించిన ఆర్టీసీ జోనల్ చైర్మన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ నెల్లూరు-1వ డిపో గ్యారేజీను నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి శనివారం పరిశీలించారు. అనంతరం గ్యారేజ్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మురళీకృష్ణ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలు నా వరకు వస్తే.. పనిచేయనట్లే!

● అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), జూలై 12(ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ సమస్యలను నాదాక తీసుకువస్తే మీరు బాగా పనిచేయడం లేదని భావించాల్సి వస్తుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శనివారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల రహిత నెల్లూరుగా తీర్చిదిద్దడంలో అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించడంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పురమిత్ర యాప్ ద్వారా వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. నెల్లూరులో అక్కడక్కడ కలుషితమైన తాగునీరు వస్తుందన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయని, వాటిని సరిచేసి సురక్షిత తాగునీరు అందించాలని తెలిపారు. మంచినీటి పైపులైన్ల కోసం తవ్విన గుంతలు, రోడ్లను వెంటనే సరి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తనివ్వకుండా చూడాలన్నారు. సీసీరోడ్లు, పార్కుల నిర్మాణాలు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నాయకులు అనురాధ, విజయభాస్కర్‌రెడ్డి, విజేతరెడ్డి పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ప్రజలకు భరోసా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : కూటమి ప్రభుత్వంలో ఏడాది పాలన అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలకు భరోసా కలిగిందని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని 46, 50 డివిజన్లలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఇరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ, విజేతరెడ్డి, మహేంద్రరెడ్డి, కప్పిర శ్రీనివాస్, సత్యనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతోపాటు తల్లి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూలై 12(ఆంధ్రజ్యోతి) : ఓ వివాహిత పిల్లలతో పాటు అదృశ్యమైన ఘటనపై వేదాయపాలెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం వైఎస్ఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న నేలపల్లి మునుస్వామి, శ్వేత దంపతులకు నాలుగేళ్ల బాబు, ఏడాది కుమార్తె ఉన్నారు. శ్వేత ఇంటివద్దనే ఉంటోంది. ఈనెల 8వ తేది మునుస్వామి మూడవమైలు వద్ద బీరువాల తయారీ దుకాణంలో పనికి వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చి 11 గంటల సమయంలో భార్య, పిల్లలతో కలిసి పడుకున్నారు. అర్ధరాత్రి 1గంట ప్రాంతంలో మెలుకవ వచ్చి చూడగా భార్య, పిల్లలు కన్పించలేదు. దీంతో బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల ప్రాంతాలు గాలించినా జాడ దొరకక పోవడంతో శనివారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరించి ఫోన్‌పేలో నగదు వేయించుకున్నారు..

నెల్లూరు(క్రైం), జూలై 12(ఆంధ్రజ్యోతి) : కత్తితో బెదరించి ఓ వ్యక్తి వద్ద ఐదు మంది వ్యక్తులు ఫోన్‌పేలో నగదు వేయించుకున్న ఘటనపై వేదాయపాలెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంకటాచలం మండలం కాకుటూరు అరుంధతీయవాడలో నాగేంద్ర నివాసం ఉంటున్నారు. ఆయన నగరంలోని బీవీ నగర్‌లో ఉన్న ఎంఆర్ బేకరిలో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 11వ తేది సాయంత్రం బేకరి నుంచి పొదలకూరు రోడ్డులోని మరో బేకరీకి స్వీట్స్ తీసుకెళుతుండగా మార్గమధ్యంలో తల్పగిరి కాలనీ సమీపంలో గుర్తుతెలియని ఐదుగురు వ్యక్తులు అడ్డగించి రోడ్డు పక్కకు తీసుకెళ్లారు. వారిలో ఓ వ్యక్తి కత్తి చూపించి నగదు ఇవ్వాలని బెదిరించగా మరో ఇద్దరు వ్యక్తులు గట్టిగా పట్టుకోగా మరో ఇద్దరు వ్యక్తులు బెదిరించారు. వారి సంభాషణలో విజయ్, సుధీర్, సిరాజ్ అని మాట్లాడుకోవడం బాధితుడు విన్నారు. చేసేది లేక అతని వద్ద ఫోన్‌పేలో ఉన్న రూ.5వేలను వారికి పంపాడు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాహిత్యం సమాజానికి అద్దంలా ఉండాలి

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 12(ఆంధ్రజ్యోతి): సాహిత్యం, సమాజానికి అద్దం పట్టేలా ఉండాలని పెన్నా రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజుల సుభద్రాదేవి అన్నారు. శనివారం టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో పెన్నా రచయితల సంఘం 16వ వార్షికోత్సవ వేడుకలకు ఆమె అధ్యక్షత వహించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రచనలల్లో పోటీల్లో ఎంపికైన గచ్చెంచెట్టుకు అటు ఇటు రచయిత డాక్టర్ సుంకరగోపాల్, పడమటదీ నాటకం పుస్తక రచయిత డాక్టర్ పెళ్లూరు సునీల్‌లకు పురస్కారాలు అందజేశారు. ఆ రెండు పుస్తకాలను సంస్థ గౌరవాధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తోట సులోచన, అవ్వారు శ్రీధర్‌బాబు, పలువురు కవులు పాల్గొన్నారు.

ధర్మనిష్ట, పరిపాలనా దక్షత కలిగిన రాజు పరీక్షిత్

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 12(ఆంధ్రజ్యోతి): భాగవతంలో పరీక్షిత్ రాజు ధర్మనిష్టత, పరిపాలనా దక్షతను వివరించారని తెలుస్తుందని డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య తెలిపారు. 3వ మైలులోని రామకృష్ణమిషన్‌లో 2వ రోజు భాగవత సప్తాహంలో పరీక్షిత్తు కథను వివరించారు. అలాగే ఐదు విభాగాలును, శుకమహర్షి జననం గురించి ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమాన్ని పద్యసారస్వత పరిషత్ నెల్లూరు శాఖ నిర్వహించింది. రామకృష్ణ మిషన్ స్వామీజీ హృదయానందజీ మహరాజ్ ప్రవచకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలవరపు లక్ష్మీనరసింహరావు, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వర్లు, పి.మల్లికార్జునశర్మ, తుర్లపాటి లక్ష్మీనారాయణ, డాక్టర్ చక్కిరాల జయప్రసాద్, కోట శ్రీరామమూర్తి, కొండిపి మురళీకృష్ణ, అవధాని రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం వీఐజీఎన్‌ఐటీఈ యాప్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న చైర్మన్ వేణు

నెల్లూరు(విద్య), జూలై 12(ఆంధ్రజ్యోతి) : నూతన విద్యా విధానాలకు అనుగుణంగా విద్యాభివృద్ధి కోసం నూతనంగా వీఐజీఎన్‌ఐటీఈ యాప్‌ను రూపొందించి ఆవిష్కరించామని ఓవెల్ విద్యాసంస్థల చైర్మన్ ఆర్.వేణు తెలిపారు. నగరంలోని ఓవెల్ జూని యర్ కళాశాలలో శనివారం యాప్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు కొత్త విద్యావిధానానికి అను గుణంగా దీన్ని రూపొందించామన్నారు. విద్యార్థి అభివృద్ధి చెం దాల్సిన అంశా లపై కచ్చితత్వంతో యాప్ పనిచేస్తుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను ఒక వేదికపైకి తీసుకువచ్చేలా దీన్ని రూపొందించారన్నారు. అనంతరం 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సిలికాన్ లోరె ట్ అనే మరో యాప్‌ను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఆర్.ప్రమీల, జీఎం మహదేవ్, ఈడీ బాలు, డీజీఎంలు సుధాకర్, శ్రీని వాస్, రఫీ, మీనాక్షి, ఏజీఎం గంగాధర్, కళాశాల ఇన్‌చార్జి విద్య, వీ.వంశీ, జీ.సూర్యతేజ పాల్గొన్నారు.

నారాయణ ఆసుపత్రికి ఉచిత బస్సు ప్రారంభం

నెల్లూరు(వైద్యం), జూలై 12(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆత్మకూరు బస్టాండు నుంచి నారాయణ ఆసుపత్రికి రోగులను తీసుకువెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఉచిత బస్సును ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దొరసానమ్మ శనివారం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నారాయణ ఆసుపత్రి ఆపరేషన్స్ హెడ్ రామారావు, నారాయణ దంత ఆసుపత్రి డీన్ డాక్టర్ శివకుమార్, వైద్య విద్యాసంస్థల సీఎఫ్‌వో సురేష్, ఆసుపత్రి అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ మంజూనాథ్, ఏజీఎం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతికి అరుదైన శస్త్ర చికిత్స

నెల్లూరు(వైద్యం), జూలై 12(ఆంధ్రజ్యోతి): ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో నగరంలోని మెడికవర్ ఆసుపత్రికి వచ్చిన కడప జిల్లా బద్వేలు ప్రాంతానికి చెందిన సుజాత(22)కు అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పల్మనాలజిస్ట్ డాక్టర్ కాంటరెడ్డి కౌశిక్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ రంజిత్‌రెడ్డి, మెడికవర సెంటర్ హెడ్ లావణ్య, కేన్సర్ ఆసుపత్రి హెడ్ పవన్, డాక్టర్ రంగనాథన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషితో 'తొలిఅడుగు'కు ప్రథమ స్థానం

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కష్టపడి పనిచేయడం వల్లే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి నెల్లూరు రూరల్‌కు రాష్ట్రంలోనే మొదట స్థానం దక్కిందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం ముగిశాక 36వ డివిజన్‌లో కార్యకర్తల ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించి మాట్లాడుతూ కార్యకర్తలు బలంగా ఉన్నందు వల్లే తాను మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచానని, వారి రెక్కల కష్టంతోనే బలమైన వ్యక్తిగా కొనసాగుతున్నానన్నారు. అధికారులెవరైన సరే ప్రజలు వచ్చి సమస్యలు చెబితే వెంటనే స్పందించాలని సూచించారు. ప్రజలను వేధించినా, వారిని ఇబ్బందులుపెట్టిన అధికారి ఏ స్థాయిలో ఉన్నా సరే కఠిన చర్యలు తప్పవని తెగేసి చెప్పారు.

● రోడ్డు పనులకు శంకుస్థాపన

31వ డివిజన్ ఓగూరుపాడు వద్ద రూ.10 లక్షలతో నిర్మించతలపెట్టిన రోడ్డు పనులకు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కూటమి పార్టీల అధ్వర్యంలో ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం వచ్చాక ఈ డివిజన్‌కు ఇప్పటి వరకు రూ.4.85 కోట్లు నిధులు కేటాయించమని తెలిపారు. కార్పొరేటర్లు బత్తల మంజుల, పిండి శాంతి, నాయకులు బత్తల కృష్ణ, మన్నేపల్లి రఘు, కూకటి హరియాదవ్‌లు పాల్గొన్నారు.

ప్రపంచ పటంలో ఏపీని బెస్ట్ రాష్ట్రంగా నిలుపుతాం

● రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్



ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతున్న అబ్దుల్ అజీజ్

నెల్లూరు(వైద్యం), జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పటంలో ఆంధ్ర రాష్ట్రాన్ని ది బెస్ట్ స్టేట్‌గా నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. సుపరిపాల నలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం జెండావీధిలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల పోస్టర్‌ను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు జాఫర్ షరీష్, మైయినుద్దీన్, నన్నేసాహెబ్, ఒతియాజ్, రబ్బాని, జాఫర్, నౌషాద్, ఖలీల్, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతతో రైతులకు ఇబ్బందులు

బుచ్చిరెడ్డిపాళె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి సాగు చేసిన రైతులు తగినంత యూరియా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గుర్నాధం అన్నారు. శనివారం బుచ్చిలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలకు తగ్గట్టు జిల్లా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడంవల్ల ఈ పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం రెండో పంటకు 3.50 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తామని చెప్పడంతో ఇప్పటికే సుమారు 2 లక్షల ఎకరాల్లో రెండో పంట సాగుచేశారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు మల్లి కార్జున తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

బుచ్చిరెడ్డిపాళెం,జూలై 12(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయాధికారి శ్రీహరి శనివారం తెలిపారు. సోమవారం నుంచి రైతులకు సరిపడేంత యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. ఇప్పటివరకు మండలంలో మొత్తం 3068.92 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు తెలిపారు. ఇందులో సొసైటీలకు 2216.545, రైతు సేవాకేంద్రాలకు 67.5, ప్రైవేటు డీలర్లకు 784.87 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

దుకాణాల తనిఖీ

ఇందుకూరుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాలలోని వ్యాపార దుకాణాల్లో ఎస్‌ఐ నాగార్జునరెడ్డి శనివారం తనిఖీలు చేశారు. ఆపరేషన్ కొస్తాంధ్రలో భాగంగా పాఠశాలలు, కాలేజీల పరిసర ప్రాంతాలలో పొగాకు ఉత్పత్తులు, మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 789 బేళ్లను తీసుకుని రాగా, 18 కంపెనీల ప్రతి నిధులు వేలంలో పాల్గొని 691 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 98 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ280కాగా, కనిష్ట ధర రూ159గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జీ. రాజశేఖర్ తెలిపారు.

సుపరిపాలనలో తొలి అడుగు..
ఓ మహా యజ్ఞం : ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తలపెట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ఓ మహా య జ్ఞమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జొన్నవాడలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్య క్రమంలో ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలు సుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కామాక్షమ్మ దయతో జొన్నవాడలో రూ. 40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులను పలకరించారు. పింఛన్లు అందుతున్నాయా? అని ఆరా తీశారు. అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా చూడా లని అధికారులను ఆదేశించారు. ఇళ్ళ విషయంలో గత ప్రభుత్వంలో జరిగిన అవక తవకలవలను సరిచేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. అంతకు ముందు జొన్నవాడ ఆలయానికి వెళ్లి శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. కామాక్షితాయి దయతోనే తాను ఎమ్మెల్యేని అయ్యానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కందికట్టు పెంచలయ్య, నాయకులు ఉమ్మయ్య స్వామి, శ్రీశైలం శ్రీధర్, సుధాకర్, రత్నం, నరసింహ, హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు



సమస్యలు వింటున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ముత్తుకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పేదల ముగింటకే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా మల్లూరులో పర్యటించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్లు అందజేస్తున్నారన్నారు. ఇటీవల జాబ్‌మేళాను ఏర్పాటు చేసి సర్వేపల్లి నియోజకవర్గంలో 500 మంది యువకులకు ఉద్యోగాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జునయాదవ్, కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నాయకులు దువ్వూరు హేమంత్‌రెడ్డి, హరిరెడ్డి, మామిడాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి కొలువు



విద్యుత్ దీపాలంకరణలో రాపూరమ్మ, గంగమ్మ ఆలయాలు

రాపూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గంగమ్మ తల్లి కొలువు మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. గంగమ్మ, రాపూరమ్మ తల్లి ఆలయాలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శనివారం ఉదయం గంగమ్మ తల్లికి అర్చన, మైలు తీర్పు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పెద్ద గొల్ల ఇంట్లో కొమ్ము జోళ్లకి పూజించి గ్రామానికి నాలుగు వైపులా గెమిది రాళ్లు కట్టారు. ఐదు గ్రామాలకు ముడుపులు కట్టి గ్రామాలకు పంపించారు. గంగమ్మ గుడిలో గ్రామ పెద్ద గొల్ల మాతమ్మకి వివాహ వేడుక తంతు భక్తితో నిర్వహించారు. రాత్రి గంగపెట్టి ఊరేగింపు, విరతాళ్ల ప్రదర్శన వైభవంగా జరిగింది.

అనుచిత వ్యాఖ్యలు తగవు

● టీడీపీ నాయకుడు గరికపాటి రాజేంద్రకుమార్

కొడవలూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, తాము ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ సీనియర్ నాయకుడు గరికపాటి రాజేంద్రకుమార్ అన్నారు. మండలంలోని కొడవలూరులో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తన రాజకీయ ఉనికి కోసం ప్రసన్నకుమార్‌రెడ్డి తన ఇంటిపై తానే దాడి చేయించుకుని సానుభూతి పొందాలని చూస్తున్నాడన్నారు. ప్రజలు ఇలాంటివాటిని నమ్మబోరన్నారు. అలాగే జిల్లాలో ఓ మాజీ మంత్రి, రాజుపాలెంలో ఓ చోటా నాయకుడు కుట్రలు చేస్తున్నా రన్నారు. ప్రజలు వీరికి తగిన గుణపాఠం చెప్పనున్నారని హెచ్చరించారు. మారు మూల గ్రామాలను సైతం పట్టణాలకు ధీటుగా ఎమ్మెల్యే అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సూర్య, మాధవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు రేషన్

● కార్డుదారుల వద్ద వేలిముద్రలు ● అక్కడే నగదు చెల్లింపు ● డీలర్ల మధ్య ఆధిపత్య పోరు

పొదలకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పోర్టబులిటీ పద్ధతిలో ఏ డీలరైనా నిర్దేశించిన సమయంలో ఎక్కడైనా ఆ యంత్రం ద్వారా కార్డు హోల్డర్ వద్ద వేలిముద్ర తీసుకుని సరు కులు అందజేసే వెసులుబాటు ఉంది. దీంతో చౌక డీలర్లు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తూ ఒకరిపై ఒకరు అధికారులకు ఫిర్యాదు చేసు కుంటున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోనే పెద్ద మండలం పొదలకూరు. ఇక్కడ 58 రేషన్ షాపులున్నాయి. ఒక్క పొదలకూరు పట్టణం లోనే 7 షాపుల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. సరుకుల పంపిణీలో మార్పులు, చేర్పులు చేయడం వల్ల డీలర్ల మధ్య ఆధిపత్య పోరు పెరిగింది. మండలంలో మొత్తం 21 వేల రేషన్ కార్డులుండగా, పట్టణంలో 3వేల వరకు ఉన్నాయి. షాపులతో పనిలేకుండా ఈ పోస్ ద్వారా ఏ డీలరైనా బియ్యం అందజేసేందుకు అవకాశం ఉంది. దీంతో ఒకరి ఏరియాలోకి మరొకరు వెళ్లి బియ్యం అందజేసే సాకుతో కార్డు హోల్డర్ల వద్ద వేలిముద్ర తీసుకుని అక్కడే నగదు చెల్లిస్తున్నారు. గతంలో బియ్యం తీసు కోవాలంటే కాటా యంత్రానికి ఈ పోస్ యం త్రానికి అనుసంధానించడం వల్ల కార్డుదా రుడు వేలిముద్ర పని చేసేది. మంచంలో ఉన్న వారికి బియ్యం అందజేసేందుకు ప్రభుత్వం వెర్షన్ మార్చి ఈ పోస్‌కు కాటా అనుసంధానం లేకుం డా చేసింది. దీంతో డీలర్లు తెలిసినవారి ఇళ్లకు వెళ్లి వేలిముద్ర తీసు కుని బియ్యం ఇవ్వకుండా నగదు ఇస్తున్నారు. బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. అయితే తమ షాపునకు చెందిన కార్డుదారుల ఇళ్లకు వేరొక డీలర్ వెళ్లి వేలిముద్ర వేయించుకుని బియ్యం కొనుగోలు చేస్తున్నా రంటూ రచ్చ మొదలైంది. కార్డు హోల్డర్ల వద్ద బియ్యం కిలో రూ.12కు కొనుగోలు చేస్తున్న డీలర్లు నల్లబజారులో రూ. 15కు అమ్ముకుంటు న్నారు. కొందరు డీలర్లయితే కార్డు హోల్డర్ల ఇళ్లకు పరుగుతీస్తూ వేలిముద్రలు వేయించు కోవడంపై వివాదాలు నెలకొంటున్నాయి. వ్యవస్థలో లోటుపాట్లను ఆసరాగా చేసుకుని బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తు న్నారు. ఇలా చేసే డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఇప్పటికే సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు పలుమార్లు హెచ్చరించారు.



స్వామివారికి తిరుచ్చి ఉత్సవం

పెంచలకోనలో శ్రీహరికి వైభవంగా కల్యాణం

రాపూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో ఆదిలక్ష్మి, చెంచు లక్ష్మీ సమేత లక్ష్మీనృసింహుడికి శనివారం తెల్లవారుజామున అభిషేకాలు, చందనాలంకారసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం భక్తజనుల మధ్య దేవేరులతో కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, రాత్రి ఊంజల్ సేవలను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు.

నిత్యాన్నదానానికి రూ.2లక్షల విరాళం

పెంచలకోనలోని శాశ్వత నిత్యాన్నదానానికి నెల్లూరు వాస్తవ్యులు కీర్తిశేషులు మాడల జానకిరామ్ జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని మాడల సూర్యవతి రూ.2,00,232లు నగదు రూపంలో ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డికి అందజేశారు.


దుర్యోధన, దుశ్శాసన వధ అలంకారం



నెల్లూరు (సాంస్కృతికం), జూలై 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం నాటికి 18వ రోజుకి చేరాయి. ఈ బ్రహ్మోత్సవాలు మహాభారతం కథానుసారం జరుగుతున్నాయి. శనివారం ఉదయం భగవద్గీత పారాయణం, చప్పర ఉత్సవం, మూలవర్లుకు విశేష పూజలు జరిగాయి. సాయంత్రం మహాభారతం ప్రవచనం, రాత్రి దుర్యోదన, దుశ్శాసన వధ అలంకారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమాలను ఉభయకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఈవో యు.జానకి పర్యవేక్షించారు.

సోమశిలకు చేరిన కృష్ణమ్మ

- పెరుగుతున్న ఇన్‌ఫ్లో
- జిల్లా రైతుల్లో ఆనందం



అనంతసాగరం జూలై 12 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి కృష్ణాజలాల రాక మొదలు కావడంతో జిల్లా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిసామర్థ్యానికి చేరుకోవడంతో వారం క్రితం 10 వేల క్యూసెక్కుల నీటిని పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు విడుదల చేశారు. ఆ తర్వాత నీటి విడుదలను పెంచారు. ఈ క్రమంలో రెండు రోజులుగా సోమశిల ప్రాజెక్టుకు వరదనీరు వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఉపనది కుందు నుంచి నేరుగా సోమశిలకు వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో సోమశిల నీటిమట్టం పెరిగే అవకాశాలు ఉన్నాయి. శనివారం ఉదయానికి 1,500 క్యూసెక్కులు వస్తున్న వరద, ఆదివారం ఉదయానికి మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. ఇన్‌ఫ్లో పెరగడంపై ఎస్‌ఈ వెంకటరమణరెడ్డిని ఆంధ్రజ్యోతి ఫోన్‌లో సంప్రదించగా కృష్ణా జలాల రాక ప్రారంభమైనట్లు చెప్పారు. జలాశయంలో 28.477 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,700 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆయన వివరించారు.



ఉద్యోగులతో కలిసి క్యారమ్స్ ఆడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన ఆయన కుమారుడు ఆరు

ఉత్సాహంగా రెవెన్యూ క్రీడలు

- కుమారుడితో కలిసి పాల్గొన్న కలెక్టర్ ఆనంద్



వాలీబాల్ ఆడుతున్న ఉద్యోగులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 12(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నరంలోని ఏసీ స్టేడియంలో రెవెన్యూ క్రీడలు రెండోరోజు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ క్రీడలు ఉద్యోగుల్లో ఎంతో ఉల్లాసాన్ని, సంతోషాన్ని నింపుతున్నాయి. శనివారం టేబుల్ టెన్నిస్, షటిల్, క్యారమ్స్ బాస్కెట్ బాల్, వాలీబాల్, చెస్, లెమన్ స్పూన్, టగ్‌ఆఫ్‌వార్, లాంగ్ జంప్, హైజంప్ తదితర క్రీడాపోటీలు జరిగాయి. ఈ క్రీడల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి జిల్లా నలుమూలల నుంచి అధికారులు, ఉద్యోగులు వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. రెండోరోజు రెవెన్యూ క్రీడల్లో కలెక్టర్ ఆనంద్ ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడాకారులతో కలిసి కలెక్టరేట్ టీమ్ తరపున క్యారమ్స్, షటిల్, టేబుల్ టెన్నీస్ పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచారు. తన కుమారుడు ఆరుతో కలిసి కలెక్టర్ క్యారమ్స్ ఆడటం చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ వివిధ క్రీడాంశాలలో పాల్గొంటున్న క్రీడాకారులను పరిచయం చేసుకుని బాగా ఆడాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్వో హుస్సేన్ సాహెబ్, ఆత్మకూరు, కావలి ఆర్డీవోలు పావని, వంశీకృష్ణ, జిల్లా ప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్, ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లను వినియోగించుకోవాలి : కలెక్టర్

పేద విద్యార్థులు ప్రభుత్వ హాస్టళ్లను వినియోగించుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న బీసీ సంక్షేమశాఖ పరిధిలోని 63 ప్రీ మెట్రిక్, 16 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలోని 71 హాస్టళ్లలో ప్రవేశానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ మంచి భోజనం, నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నదని తెలిపారు. ఆయా సంక్షేమశాఖల కార్యాలయాల్లో సంప్రదించి పిల్లలను హాస్టళ్లలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.

ఎన్టీఆర్ విద్యా సంకల్పం !

- పొదుపు మహిళల పిల్లల కోసం పథకం
- కేజీ నుంచి పీజీ విద్యార్థుల వరకు అమలు
- నాలుగుశాతం వడ్డీతో రుణం
- స్త్రీనిధి బ్యాంకులో రూ. 10వేల నుంచి రూ.లక్ష వరకు..
- లబ్ధిపొందే కుటుంబాల హర్షం



స్త్రీనిధి రుణం ఇచ్చే గ్రామీణాభివృద్ధి సంస్థ - వెలుగు కార్యాలయం

సంగం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇప్పటికే విద్యార్థి మిత్ర కిట్లు, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం తదితరాలను అమలు చేస్తున్నది. దీంతోపాటు సీఎం చంద్రబాబు మరో పథకానికి శ్రీకారం చుట్టారు. పొదుపు మహిళల పిల్లల చదువుల కోసం రుణాలు అందించి ఆదుకునేందుకు సిద్ధమయ్యారు. రుణం అందించి తక్కువ వడ్డీతో నెలనెలా చెల్లించేలా రూపొందించిన పథకమే ఎన్టీఆర్ విద్యా సంకల్పం. ఈ పథకం పలువురు పొదుపు మహిళల పిల్లల చదువుకు కొండంత అండగా నిలవనున్నది.

● నాలుగుశాతం వడ్డీతో రుణం

పొదుపు మహిళల పిల్లల విద్యాభివృద్ధి కోసం స్త్రీనిధి బ్యాంకు ద్వారా నాలుగుశాతం (35 పైసలు) వడ్డీకే రూ. 10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం పొందే వీలుంది. ప్రస్తుతం పొదుపు సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి కోసం స్వయం ఉపాధి పొందేందుకు స్త్రీనిధి నుంచి 12 శాతం వడ్డీతో రుణాలు అందిస్తున్నారు. ఈ పథకం ప్రవేశ పెట్టడంతో కేవలం నాలుగు శాతానికి వడ్డీతో రుణాలు ఇవ్వాలని ఆదేశించారు.

● అధిక వడ్డీలకు అప్పు చేసి..

గతంలో పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు అధిక వడ్డీలకు అప్పులు చేసి,అవి తీర్చేందుకు ఆస్తులు అమ్ముకొని ఇబ్బందులు పడేవారు. దీన్ని గమనించిన సీఎం చంద్రబాబు కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే పిల్లలకు ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. రుణం తీసుకున్న మహిళ తీసుకున్న రుణాన్ని బట్టి కనిష్ఠంగా 24 కంతుల నుంచి 36 కంతుల వరకువాయిదాల పద్ధతిలో 35 పైసలు వడ్డీకే రుణం చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. ప్రభుత్వం ఇందుకోసం రూ. 200 కోట్లు ఖర్చు చేసేలా విధివిధానాలు తయారు చేసింది. జిల్లాలో సుమారు 35,600 పొదుపు సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో సుమారు 3.36 లక్షల మంది పొదుపు మహిళలు ఉన్నారు. ఈ పథకం వల్ల వీరి ఇళ్లలో ఉన్న సుమారు నాలుగు లక్షల మందికి పైగా విద్యార్థులు లబ్ధిపొందనున్నారు.



ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకం శ్రీకారంపై హర్షం వ్యక్తం చేస్తున్న పొదుపు మహిళలు



నిందితుడి వివరాలు తెలుపుతున్న డీఎస్పీ మురళీధర్

రైల్వే స్టేషన్‌లో 12 కిలోల గంజాయి పట్టివేత

నెల్లూరు(క్రైం), జూలై 12(ఆంధ్రజ్యోతి): నెల్లూరు డీఎస్పీ జీ.మురళీధర్ మార్గనిర్దేశాల మేరకు నెల్లూరు రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ సుధాకర్ నేతృత్వంలో జిల్లాలో జీఆర్‌పీఎస్, ఆర్‌పీఎస్ పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై రైల్వే స్టేషన్‌లు, రైళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఈనెల 11వ తేది మధ్యాహ్నం గూడూరు రైల్వే స్టేషన్‌లోని 4వ నెంబరు ఫ్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నిందితుడి వివరాలను నెల్లూరు నగరంలోని డీఎస్‌ఆర్పీ కార్యాలయంలో డీఎస్పీ మురళీధర్ విలేకర్లకు వెల్లడించారు. ఆపరేషన్ ఈగల్-2లో భాగంగా అందిన సమాచారం మేరకు గూడూరు తహసీల్దారుతో కలిసి తనిఖీలు చేశారు. ఈ క్రమంలో టాటానగర్-ఎర్నాకుళం జంక్షన్ ఎక్స్‌ప్రెస్ నుంచి దిగి రైల్వే స్టేషన్‌లో నడుచుకుంటూ వస్తున్న తమిళనాడు రాష్ట్రం తిరుపూర్ ప్రాంతానికి చెందిన హరిహరన్‌ను అదుపులోకి తీసుకొని విచారిం చారు. అతని వద్ద నుంచి 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. తనిఖీల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

డాక్టర్ పీర్‌కుమార్‌కు ఎన్టీఆర్ జాతీయ అవార్డు



ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్న డాక్టర్ బద్రి పీర్‌కుమార్

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 12(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ బద్రి పీర్‌కుమార్‌కు ఎన్టీఆర్ జాతీయ అవార్డు దక్కింది. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ ఎన్టీ రామారావు, భారతరత్న పీవీ.నరసింహారావు జయంతి ఉత్సవాలు-2025 శనివారం శ్రీత్యాగరాయ గానసభ, కళా వెంకటదీక్షితులు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్‌లో జరిగాయి. తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌజన్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి ప్రతిభావంతులకు ఎన్టీఆర్, పీవీ నరసింహారావు జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. డాక్టర్ బద్రి పీర్‌కుమార్‌ను ఎన్టీఆర్ జాతీయ అవార్డుతో గుర్రం జాషువా వారసురాలు అమృతపూడి రేవతి, ఝాన్సీ లక్ష్మీబాయి వారసురాలు ఎస్.శాంతాబాయి, సరస్వతీ ఉపాసకులు దైవిజ్ఞ శర్మ, తదితరులు ఘనంగా సత్కరించారు. ఈయన 26 ఏళ్లుగా అధ్యాపకుడిగా, నటుడిగా, రచయితగా, ప్రతిభ కనపరుస్తూ విద్య, సినిమా, టీవీ, నాటక కళా రంగానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా, కళాకారుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తించి ఈ అవార్డు అందజేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ అవార్డు రావడంతో తన బాధ్యత మరింత పెరిగిందని విద్య, కళారంగానికి తనవంతు సేవలు అందిస్తుంటానని పీర్‌కుమార్ తెలిపారు.

బలవంతపు భూసేకరణను అడ్డుకుంటాం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో మిరియం శ్రీనివాసులు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యమ నేత మిరియం శ్రీనివాసులు

నెల్లూరు(వైద్యం), జూలై 12(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండోసోల్ సోలార్ పరిశ్రమ కోసం బలవంతపు భూసేకరణను అడ్డుకుంటామని ఉద్యమ నేత మిరియం శ్రీనివాసులు తెలిపారు. శనివారం నెల్లూరు నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో కరేడులో భూసేకరణపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇండోసోల్ సంస్థ కోసం రాష్ట్ర ప్రభుత్వం 8400 ఎకరాల భూసేకరణ చేయాలని జీవో నెంబర్ 43ను విడుదల చేసిందన్నారు. అయితే ఈ జీవోను మార్పుచేసి గతనెల 21వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తూ 5వేల ఎకరాలు సేకరిస్తే సరిపోతుందని వెల్లడించిందన్నారు. ఈ భూసేకరణను వ్యతిరేకిస్తూ ప్రజలు, రైతులు జాతీయ రహదారిని దిగ్బంధనం చేశామన్నారు. పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని ఎలాగైనా అణచివేయాలని చూస్తుందని చెప్పారు. మంత్రి నారా లోకేష్ జిల్లా పర్యటనలో పార్టీ నేతలతో మాట్లాడటంతో ఎప్పుడూ ఊరికిరాని ఎమ్మెల్యేలు కొందరు రైతులతో మాట్లాడినా సెంటు భూమి కూడా ఇవ్వమని తెగేసి చెప్పారన్నారు. రైతు సంఘం నాయకులు పులిగండ్ల శ్రీరాములు, మంగళం పుల్లయ్యలు మాట్లాడుతూ ఈ బలవంతపు భూసేకరణను అడ్డుకునేందుకు కరేడు రైతులకు అండగా నిలిచి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో రైతులతో కలిసి కలెక్టర్ ఆనంద్‌ను కలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, కోటిరెడ్డి, సాగర్, శంకర్‌కిశోర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అపరిచితుడి కలకలం

మనుబోలు, జూలై 12: స్థానిక పడమరవీధిలో శుక్రవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి మోటారు సైకిల్‌పై రామ మందిరం వద్ద అనుమానాస్పదంగా తిరుగాడుతుండగా స్థానికులు గుర్తించి 100 కు ఫోన్‌చేశారు. పోలీసులు మందిరం వద్దకు చేరుకునేసరికి అపరిచితుడు మోటార్‌సైకిల్ వదిలి పారిపోయాడు. దీంతో పోలీసులు మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా గ్రామంలోకి చోరులు ప్రవేశించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ ముమ్మరం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం

- రూ.4 లక్షల ఆస్తి నష్టం



మంటల్లో కాలిపోయిన పూరిళ్లు

విడవలూరు, జూలై12(ఆంధ్రజ్యోతి): వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పంటుకోవడంతో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన మండలంలోని వరిణి పంచాయతీ గిరిజనకాలనీలో శనివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గిరిజనకాలనీకి చెందిన ఈగా అంకులయ్య ఇంట్లో వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో పూరిల్లు దగ్ధమైంది. ఈ క్రమంలోనే సమీపంలో ఉన్న శీనమ్మ అనే గిరిజన మహిళకు చెందిన పూరిగుడిసె కూడా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ. 1.5 లక్షల నగదు రూ. 2.5 లక్షల విలువ చేసే వస్తువులు దగ్ధమయ్యాయి. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వాపోయారు. ప్రమాద సమయంలో ఇంట్లో వంట చేస్తున్న మహిళలు అప్రమత్తం కావడంతో ప్రాణాపాయం తప్పింది.

పాముకాటుతో మహిళ మృతి

సీతారామపురం, జులై12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యావారిపల్లి సమీపాన వేప విత్తనాలు ఏరుకునేందుకు వెళ్లిన మహిళను శనివారం పాము కాటువేయడంతో మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు, సింగారెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన అంకి పుష్ప(39) రోజు మాదిరిగానే గ్రామానికి చెందిన మరో మహిళతో కలిసి వేప విత్తనాలు ఏరుకునేందుకు అయ్యావారిపల్లి మార్గంలోని పొలాలకు వెళ్లింది. అక్కడ వేప విత్తనాలు ఏరుకుంటూ ఉండగా పాము కాటు వేసింది. సహచర మహిళ స్థానికుల సహాయంతో 108 వాహనంలో సమీపంలోని పీహెచ్‌సీకి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు.

హత్య జరిగిన ప్రదేశం పరిశీలన



హత్య స్థలాన్ని పరిశీలిస్తున్న కావలి డీఎస్పీ శ్రీధర్

ఉదయగిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్‌ఖైర్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం రాత్రి హత్య జరిగిన ప్రదేశాన్ని శనివారం కావలి డీఎస్పీ శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఫంక్షన్ హాల్ నిర్మాణంలో చోటుచేసుకున్న ఆస్తి, ఆర్థిక లావాదేవీల వల్లే షేక్ మహ్మద్ హమీద్‌ను ఉమరఅలీ, హనీఫ్ మారణాయుధాలతో దాడి చేసి దారుణంగా హతమార్చారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. హమీద్‌ను హత్య చేయడంలో వారిద్దరితోపాటు ఇంకా ఎవరైనా ఉన్నారనే కోణంలో విచారణ జరుపుతున్నామన్నారు. నిందితుల కోసం రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. త్వరలో నిందితులను అదుపులోకి తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కలిగిరి సీఐ వెంకటనారాయణ, ఎస్‌ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఆల శ్రీను, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హమీద్ ఒంటిపై 16 గాయాలు

ఆస్తి వివాదంలో సమీప బంధువుల చేతిలో దారుణ హత్యకు గురైన షేక్ మహ్మద్ హమీద్ ఒంటిపై 13 కత్తి పోట్లు, 3 ఇనుపరాడ్ దెబ్బలతో కలిపి మొత్తం 16 గాయాలు ఉన్నట్లు శనివారం వైద్యులు నిర్వహించిన పోస్టుమార్టంలో వెల్లడైంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కోడిపందెం స్థావరంపై దాడి

కొండాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట గ్రామ పరిసరాలలోని పొలాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు శనివారం దాడిచేశారు. ఈ దాడిలో 4 కోళ్లు, రూ. 39వేల నగదు, 30 మోటారుసైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకుని ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో కలిగిరి ఎస్‌ఐ ఉమాశంకర్‌తోపాటు మండల పోలీసులు పాల్గొన్నారు.

రేపు ఐటీఐలో అప్రెంటీస్ షిప్ మేళా

నెల్లూరు(విద్య), జూలై 12(ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో సోమవారం ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో జిల్లాలోని ప్రముఖ కంపెనీలు పాల్గొని యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తగిన ధ్రువపత్రాలతో సోమవారం ఉదయం 10 గటలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

డ్రైవర్‌ను ఏమార్చి బ్యాగ్ అపహరణ

నెల్లూరు(క్రైం), జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కారు డ్రైవర్‌కు చిల్లర కింద ఉందని మాయ మాటలు చెప్పి కారులోని బ్యాగును అపహరించుకెళ్లిన ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. విజయవాడ తాడిగడపలో తల్లం శ్రావణ్ నివాసం ఉంటున్నారు. ఆయన ఓ కంపెనీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తూ విజయవాడ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో సేల్స్‌కు సంబంధించిన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే సేల్స్ పనులపై ఈనెల 10వ తేది సాయంత్రం కారులో నెల్లూరుకు వచ్చారు. సాయంత్రం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని సోనోవిజన్ వద్ద కారును నిలిపి బయటకు వెళ్లగా కారు డ్రైవర్ కారులో ఉన్నారు. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు కారు పక్కనే చిల్లర వేసి డ్రైవరుకు చెప్పడంతో వాటిని గమనించిన డ్రైవర్ తీసుకుంటుండగా కారులోని బ్యాగును అపహరించుకు వెళ్లారు. బ్యాగుల్లో రెండు డెల్ ల్యాప్‌టాప్‌లు, ఐడీ కార్డులు, పలు వస్తువులు ఉన్నాయి. ఈ క్రమంలో మోసపోయామని గుర్తించిన శ్రావణ్ చిన్నబజారు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి కోనేటిలో మృతదేహం

బిట్రగుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్న వేంకటేశ్వరస్వామి కోనేటిలో శనివారం మధ్యాహ్నం పురుష మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. స్థానికుల చొరవతో మృతదేహాన్ని కోనేటి గట్టుపైకి తీసుకువచ్చారు. స్థానిక ఎస్సై ప్రభాకర్‌రావుకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. ఎస్సై వివరాల మేరకు... మృతుడు బోగోలు కుమ్మరవీధి ఎస్టీ కాలనీకి చెందిన సుకపల్లి పూర్ణచందర్‌రావు (32) గుర్తించామన్నారు. కొయ్య పని చేసుకుంటూ జీవనం గడిపే పూర్ణచందర్‌రావు తోటి పనివారితో కలిసి పని కోసం కొండబిట్రగుంటకు వెళ్లాడు. పని దొరక్కపోయేసరికి అన్నదాన సదనంలో భోజనం చేసుకుని ముఖం కడుగుకొనేందుకు కోనేటి వద్దకు పోయి ప్రమాదవశాత్తు పడిపోయాడని స్థానికుల ద్వారా తెలిసిందన్నారు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి మృతుని తండ్రి సుకపల్లి వీరరాఘవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, శ్రీవారి కోనేటిలో బోగోలు వాసి మృతిచెందాడని తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, స్థానిక నేతలు బోగిరి ప్రభాకర్, రావి విజయ్ కుమార్, ఆర్.రంగయ్య సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి

మనుబోలు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జాతీయరహదారిపై కొండూరు సత్రం పవర్‌గ్రిడ్ సమీపంలో ఓ యాచకుడి మృతదేహం లభ్యమైంది. శనివారం తెల్లవారుజామున ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ. శివరాకేష్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సుమారు 60 ఏళ్లు ఉంటాయని, తెలుపురంగు చొక్కా, చారల లుంగీ ధరించాడన్నారు.. చింపిరి గడ్డం, మాసిపోయిన దుస్తులను బట్టి యాచకుడై ఉంటాడని, రోడ్డు దాటే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మరణించి ఉంటాడని ఎస్ఐ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 525

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9414
వెండి కిలో ధర	రూ. 115600
వెండి ఒక గ్రాము	రూ.118.60

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 789 బేళ్లను తీసుకుని రాగా, 18 కంపెనీల ప్రతి నిధులు వేలంలో పాల్గొని 691 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 98 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ280కాగా, కనిష్ఠ ధర రూ159గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జీ. రాజశేఖర్ తెలిపారు.

న్యూస్ బాక్స్

ఘనంగా షిరిడీ సాయిబాబా గ్రామోత్సవం



ట్రాక్టర్‌పై ఊరేగుతున్న సాయిబాబా

సంగం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్‌లో వెలసి ఉన్న షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి షిరిడి సాయిబాబా గ్రామోత్సవం వైభవంగా జరిగింది. సాయిబాబా విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గజపూలమాలలు, విద్యుత్‌దీపాలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రవణ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పేద విద్యార్థినికి ఎమ్మెల్యే ఇంటూరి ఆర్థిక సాయం

కందుకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన నిరుపేద విద్యార్థిని విద్యాభ్యాసం కోసం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆర్థికసహాయం అందించారు. మండలంలోని ఓగూరు గ్రామానికి చెందిన ఆర్షియాజ్ పదవ తరగతిలో 577 మార్కులతో మండలస్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించటం ద్వారా ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. అయితే అక్కడ చేరేందుకు ఆమె తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇస్లాం దూదేకుల కమిటీ (కువైట్-ఇండియా) ప్రతినిధి నాగూర్ బాబు ఆమె చదువు కోసం రూ. 25వేలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈసంద ర్భంగా ఎమ్మెల్యే కూడా తన వంతుగా రూ. 10వేలు ఆర్థిక సహాయాన్ని ఆర్షియాజ్ కు అందించారు. ఆమె చదువుకోసం తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంటీఏ నాగూర్ బాబు, నరసింహారావు, రామకృష్ణ, జిల్లెలమూడి మస్తాన్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

532 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 625 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 532 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-65, ఆర్ఆర్-6, సీఆర్-16, జంపింగ్ లాట్స్-6 కారణాలతో 93 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, నగటు ధర రూ. 205.78గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

పేదలకు ఆహారం పంపిణీ

కందుకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పొన్నలూరు తహసీల్దార్ ఉయ్యాల పుల్లారావు సహకారంతో శనివారం విప్పగుంట రోడ్డులో మార్కెట్‌యార్డు ప్రహరీ సమీపంలో నివసిస్తున్న సంచార జాతుల వారికి, పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఉండే యాచకులకు ఆహారప్యాకెట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, ఇన్నమూరి శ్రీనివాసులు, సోమిశెట్టి శశాంక్ గుప్తా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరురోడ్డు సబ్ స్టేషన్ నుంచి వెళ్లే 11 కేవీ వెంకటాద్రిపాలెం ఫీడర్‌లో లైనుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ టీవీ నరసింహ్మం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని తానికొండవారి కొష్టాలు, రామానాయుడు నగర్, మధురానగర్, బిలాల్‌నగర్, కనిగిరిరోడ్డు సామిల్లుల ఏరియా, లంబాడి డొంక, దూబగుంట, వెంకటాద్రిపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సీతారామపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం నుంచి మోటారుబైకుపై శనివారం మండలంలోని గంధంవారిపల్లికి నరాల రాజశేఖర్, రమణయ్య వెళ్తున్నారు. మార్గమధ్యంలోని ఇటుకల బట్టీ వద్దకు వచ్చేసరికి జాతీయ రహదారిపై పంది అడ్డుగా రావడంతో ఢీకొని గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నత్తనడకన అన్నపుగుంట తూము పనులు

- రాకపోకలకు ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

కావలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ అన్నపుగుంట వద్ద సుమారు రూ.30 లక్షలతో నిర్మిస్తున్న తూము అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అత్యవసరమైన ఈమార్గంలో చకచకా జరగాల్సిన పనులు నత్తనడకన సాగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోతే వైకుంఠపురం, జనతాపేట వాసులు కలుగోళ్ల శాంభవి ఆలయం వైపు పట్టణంలోకి రాకపోకలు సాగించాలంటే కనీసం 4.కి.మీ చుట్టూ తిరిగి రావాల్సి ఉంది. అలాగే జేబీ కళాశాలకు, పీజీ సెంటర్‌కు వెళ్లే విద్యార్థులు, 8వ వార్డు మున్సిపల్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థుల రాకపోకలకు అవస్థలు తప్పటంలేదు. కాగా, అన్నపుగుంటలో ఉన్న మురుగు నీరు బావులు, బోర్లలోకి చేరుతోందని స్థానికులు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లటంతో ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించి అన్నపుగుంటలో పూడిక తీయించారు. అలాగే పూడికతీసిన ఆ గుంట నిండిన తర్వాత ఆ నీరు కలుగోళ్ల శాంభవి ఆలయం వైపు ఉన్న వరవ కాలువలోకి



అన్నపుగుంట వైపు జరుగుతున్న తూము నిర్మాణ పనులు



కలుగోళ శాంభవి ఆలయ మార్గంలో జరుగుతున్న పనులు

రైల్వేట్రాక్ కింద ఉన్న వరదనీటి మార్గం ద్వారా పొర్లి వస్తుంటాయి. దీంతో అక్కడ పాదచారులకు ఇబ్బందిగా ఉండటంతో నీరు అక్కడ పొర్లకుండా ఉండే విధంగా ఆ మార్గంలో పైపులు ఏర్పాటుచేసి దానిపై కాంక్రీట్ చేస్తున్నారు. ఆ నీరు పైపుల ద్వారా వరవ కాలువలోకి నేరుగా వెళ్లే విధంగా డిజైన్ రూపొందించారు. అంతవరకు అందరూ హర్షిస్తున్నా నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన పనులు జరిగేలా చర్యలు తీసుకుని రాకపోకలకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సుపరిపాలన అందించడమే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యం



ఉలవపాడు: ఎస్సీ కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



గుడ్లూరు: తెట్టులో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

కందుకూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డులు, మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామంలో శనివారం టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ కరపత్రాలు పంపిణీచేశారు. పట్టణంలోని 137వ బూత్‌లో తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ నిర్వహించగా సుల్తాన్‌మొహిద్దీన్ నగర్‌లో షేక్ రఫీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని శ్రీరంగరాజపురంలో మండల పార్టీ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సలహాదారు గుళ్లా శ్రీనివాసులు, వివిధ గ్రామాల నాయకులు పచ్చవ తిరుపతిస్వామి, రెబ్బవరపు మాల్యాద్రి, రావుల రవి, ఈదర నరసయ్య, రాయపాటి శ్రీను, భైరపనేని రమణయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు వంకదారి శ్రీనివాసులు, స్థానిక నాయకులు వీరారెడ్డి, మాలకొండారెడ్డి, మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **గుడ్లూరు:** రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే తెలుగు దేశం ప్రభుత్వ ధ్యేయమని గుడ్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు అన్నారు. మండలంలోని తెట్టు గిరిజన కాలనీలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ సంవత్సర కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం నిర్వహించిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే స్థానికంగా నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు చిత్తారి మల్లికార్జున, ఉమ్మినేని సుబ్బారావు, గ్రామ నాయకులు మద్దసాని శ్రీనివాసులు, కె వెంకటేశ్వర్లు, షేక్ చినబాబు, యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, జాల రామయ్య, తెట్టు, మోచర్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **వలేటివారిపాలెం :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం తెలిపారు. మండలంలోని కళ్లవళ్ల, వలేటివారిపాలెం తదితర గ్రామాల్లో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోదేపల్లి నారాయణ, కాకుమాను ఆంజనేయులు, మోదేపల్లి నరసింహరావు, వలేటి నరసింహం, మోదేపల్లి శ్రీనివాసులు, వలేటి మధుసూధన్‌రావు, మోదేపల్లి మధు, వీరమోసు అంజయ్య, మోదేపల్లి వెంకటనరసింహం, తదితరులు పాల్గొన్నారు.

● **ఉలవపాడు:** స్థానిక ఎస్సీ కాలనీలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి పనికి వెళ్లినా మస్టర్లు సరిగా వేయడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. దీంతో ఉపాధి సిబ్బందితో మాట్లాడి మరోసారి జరగకుండా చూడాలని ఆదేశించారు. కాలనీలో పారిశుధ్యం, శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్ స్థానంలో కొత్త భవనం నిర్మాణం, పక్కాగృహాల మంజూరు తదితర సమస్యలను పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తొలుత మండల పార్టీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు కార్యకర్తలు, నాయకులతో కలిసి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు గిరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **చేజర్ల:** కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చేజర్ల మండల టీడీపీ అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని తిరుపతినాయుడుపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేతృత్వంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రావి లక్ష్మీనరసారెడ్డి, చీర్ల వెంకటేశ్వర్లు, స్థానిక టీడీపీ నాయకులు అంకయ్య తదితరులు పాల్గొన్నారు.



కళవళ్లలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు



తిరుపతినాయుడు పల్లిలో కరపత్రాలు పంచుతున్న నేతలు

తాగునీరు వృథా పట్టదా...?

ఉదయగిరి రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు చెబుతున్న మాటలు మండలంలోని దుర్గంపల్లిలో నీటి మూటలుగానే మిగులుతున్నాయి. ఆ గ్రామంలోని ప్రధాన రహదారి సమీపంలో తాగునీటిని సరఫరా చేసే విద్యుత్ మోటారు వద్ద రోజుల తరబడి తాగునీరు వృథా అవుతున్నప్పటికీ పట్టించుకునే నాథులే కరువయ్యారనే విమర్శలు ఉన్నాయి. పైపులైనుకు అమర్చిన వాల్వు వద్ద నిరంతరం నీరు వృథాగా పోతుండడంతో ప్రాంగణమంతా బురదమయంగా మారి దోమలకు నిలయంగా దర్శనమిస్తోంది. దీంతో నివాసాలకు నీటి సరఫరా తగ్గుముఖం పడుతుండడంతో పాటు రోగాల బారిన పడాల్సిన దుస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వృథాగా పోతున్న తాగునీరు

విద్యుత్ స్తంభాన్ని అల్లుకున్న నిర్లక్ష్యపు తీగ..

అనంతసాగరం జూలై 12 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మంగుపల్లి, గౌరవరం వద్ద విద్యుత్ స్తంభాలకు తీగజాతి మొక్కలు అల్లుకొని ఉన్నాయి. దీంతో వర్షం పడిన సమయంలో విద్యుత్ అంతరాయం నెలకొనే అవకాశం ఉంది. బద్వేల్ ప్రధాన రహదారి పక్కనే ఈ పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



విద్యుత్ స్తంభానికి అల్లుకున్న మొక్క

పగలే వెన్నెలా..

సంగం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం లక్షలకు లక్షలు వెచ్చించి సబ్సిడీలు, సోలార్ లైట్లు, సోలార్ ప్యానల్ వంటివి అంజేస్తుంది. అయితే పంచాయతీల్లో పర్యవేక్షణ కొరవడడంతో వీధిలైట్లు పట్టపగలే వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. అందుకు నిదర్శనం అన్నారెడ్డిపాలెం పంచాయతీ. ఇక్కడ వీధిలైట్లు ఆర్పేవారే లేకపోవడంతో నిరంతరం వెలుగుతున్నాయి. విద్యుత్ వినియోగాన్ని అరికట్టాల్సిన ప్రభుత్వ అధికారులే నిర్లక్ష్యం చూపడం విశేషం.



అన్నారెడ్డిపాలెంలో వెలుగుతున్న వీధిలైట్లు

కొండాపురం ఎస్‌ఐగా మాల్యాద్రి

కొండాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల ఎస్‌ఐగా జే మాల్యాద్రి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ ఎమ్ వెంకటరావు వీఆర్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో మాల్యాద్రి బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా పర్చూరు మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై మండలానికి వచ్చారు.



బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం : సీఐటీయూ

కావలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే స్వీపర్ల సమస్యలు పరిష్కరించుకోవాలని సీఐటీయూ నాయకులు పీ పెంచలయ్య తెలిపారు. సీఐటీయూ అనుబంధ ప్రభుత్వ పాఠశాలల స్వీపర్స్ మూడవ మహాసభ శనివారం కావలి సీఐటీయూ కార్యాలయంలో ఏ ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐటీయూ నాయకుడు పీ పెంచలయ్య మాట్లాడుతూ పాఠశాలల స్వీపర్స్‌కు పనిభారం ఎక్కువ, జీతాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని పోరాటాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజులలో ఐక్యంగా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు పెంచలయ్య

ప్రభుత్వ పాఠశాలల స్వీపర్స్ యూనియన్ కావలి పట్టణ అధ్యక్షురాలిగా ఏ ఆదిలక్ష్మి, కార్యదర్శిగా కే పద్మ, ఉపాధ్యక్షులుగా ఎం శుభ, జాయింట్ కార్యదర్శిగా ఎం శోభ మరికొంతమంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

కోరం లేక వీఎస్ఎస్ చైర్మన్ ఎంపిక వాయిదా

ఉదయగిరి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గంపల్లి ఎస్సీ కాలనీ వన సంరక్షణ సమితి చైర్మన్ ఎంపిక కోరం లేక వాయిదా వేసినట్లు డీఆర్వో మురళి, ఎఫ్ఎస్‌వో చినవెంకటయ్య శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ 119 మంది సభ్యులకుగానూ చైర్మన్ ఎంపికకు 17 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. దీంతో కోరం లేకపోవడంతో చైర్మన్ ఎంపిక వాయిదా వేశామన్నారు. తదుపరి చైర్మన్ ఎంపిక ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు బచ్చల వెంక టేశ్వర్లు, లక్ష్మీప్రసన్న, ఫడ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు ఇత్తడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో దోమల ఉధృతి పెరగడంతో పాటు అనేక రకాల వ్యాధులు పొంచి ఉన్నాయని డెంగ్యూ జ్వరాలు తదితర సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు అర్బన్ ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ అస్మా తెలిపారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల వసతి గృహం, కాలేజి బాలుర వసతి గృహంలో శనివారం ఆమె విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లా డుతూ హాస్టల్ చుట్టూ దోమలు ఉత్పత్తి అయ్యే నీటి నిలువలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రాణాంతకరమైన డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధులు దోమల ద్వారానే వ్యాపిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఎస్ సుధాకర్, జీ. రవీంద్రారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అస్మా



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ రామకృష్ణ, కోవూరుపల్లి పీహెచ్‌సీ

ముఖాముఖి

బిట్రగుంట, జూలై 12(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పారిశుధ్యం అధ్వానంగా ఉండడం, అపరిశుభ్రత కారణంగా వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది గారమాల్లో పర్యటిస్తున్నారని కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు రామకృష్ణ తెలిపారు.

? సీజనల్ వ్యాధులు రాకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి వ్యాధులకు కారణమైన అపరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం.

? కోవూరుపల్లి పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉందా.

! ఒక స్టాఫ్ నర్సు, డ్రైవర్ పోస్టు కాళీగా ఉన్నాయి. అంతకుమించి సిబ్బంది కొరత లేదు.

? ఏఆర్‌వీ (యాంటీ రాబిస్) వ్యాక్సీన్ అందుబాటులో ఉందా.

! కోవూరుపల్లి పీహెచ్‌సీలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఏ సమయంలోనైనా ఆరోగ్య సిబ్బంది వేస్తారు.

? మండలంలో ఎక్కువ శాతం రక్త హీనత ఉన్న వారి పట్ల ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! గిరిజన కాలనీల్లో మహిళల్లో రక్తహీనత ఎక్కువ శాతం ఉంది. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ద్వారా వారికి అవగాహన కల్పించడంతో పాటు మందులు సరఫరా చేస్తున్నాం. అంగన్వాడీలో అందచేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా తీసుకునేలా చర్యలు చేపడుతున్నాం.

? పీహెచ్‌సీలో కాన్పులు చేసేందుకు వసతులు ఉన్నాయా.

! అనుభవం ఉన్న మహిళా వైద్యులు, సిబ్బంది ఉన్నారు. ఏ సమయంలోనైనా కాన్పులు చేసేందుకు వసతులు ఉన్నాయి.

ముగిసిన పవిత్ర ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

అనంతసాగరం జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాల వద్ద వెలసి ఉన్న ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న పవిత్ర ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో అర్చక బృందం హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఉభయకర్తలు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

వీడే మన వారసుడు సినిమా విజయవంతం కావాలి : ఎస్‌ఐ



ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో మాట్లాడుతున్న పట్టణ ఎస్‌ఐ శివనాగరాజు

కందుకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవూరు గ్రామానికి చెందిన ఉప్పు రమేష్ నిర్మించిన సందేశాత్మక చిత్రం వీడే మన వారసుడు విజయవంతం కావాలని పట్టణ ఎస్‌ఐ శివనాగరాజు ఆకాంక్షించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా పట్టణంలోని ఆదిత్య గ్రాండ్ రెస్టారెంట్‌లో శనివారం ప్రీరిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటులు ఆనంద్‌భారతి, శర్వాణిమోహన్, కిషోర్, వెంకటేష్, రజని పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 13 జూలై 2025



గజరాజుల కట్టడికి యాక్షన్ ప్లాన్

దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగుల దాడులను కట్టడి చేసేందుకు కార్యాచరణ సిద్ధమవుతోంది. ఇందుకోసం ఏర్పాటు చేసిన ఒక కమిటీ తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో ఏనుగుల సంతతి, వాటి కదలికలు, ప్రజల ఆస్తులు, ప్రాణాలకు నష్టం కలగకుండా ఎలా కట్టడి చేయాలి అనే దానిపై యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. పూర్తిస్థాయిలో పరిశీలించి, నివేదికను నోడల్ కమిటీకి అందజేసింది.

8

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. నగరంలోని 10 ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పూర్ణకుంభం సర్కిల్ నుంచి భారతి బస్టాండు వద్దకు నడుచుకుంటూ వెళ్లారు. అక్కడ ప్రైవేటు వాహనాల వారికి కొన్ని సూచనలు చేశారు. తిమ్మినాయుడుపాళెం వాసులతో ముచ్చటిస్తూ అక్కడి సమస్యలను నోరుగా తెలుసుకున్నారు.



శ్రీకాళహస్తిలో కలకలం

- హత్యకు కారణాలపై పలు అనుమానాలు
- పార్టీ నుంచి బహిష్కరించిన జనసేన అధిష్ఠానం

మాజీ పీఏ హత్య కేసులో జనసేన ఇన్‌ఛార్జి వినుత దంపతులు సహా ఐదుగురి అరెస్టు



శ్రీనివాసులు (ఫైల్ ఫొటో)



శ్రీనివాస్ మృతదేహంపై వాతలు

శ్రీకాళహస్తి/తిరుపతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి):మాజీ పీఏ హత్య కేసులో శ్రీకాళహస్తి జనసేన ఇంచార్జి వినుత దంపతులను చెన్నై పోలీసులు అరెస్టు చేయడం రాజకీయవర్గాల్లో కలకలం రేపింది.అసలేం జరిగిందో తెలియక పార్టీ వర్గాలతో పాటు ప్రజానీకం కూడా అయోమయానికి లోనైంది.రేణిగుంట పట్టణానికి చెందిన వినుతను 2019లో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రకటించారు. బంగారుపాళ్యానికి చెందిన కోట చంద్రబాబుతో అదే సంవత్సరంలో ఆమెకు వివాహం జరిగింది. ఆ సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసి ఓడిపోయారు. శ్రీకాళహస్తి పట్టణంలో వినుత దంపతులు అద్దె ఇంట్లో నివాసం, పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు సాగించేవారు.

హత్యకు దారితీసిన కారణాలేంటి?

గత ఎన్నికలకు ముందు నుంచీ కూడా వినుతకు జనసేనలోనే ఇతర నేతలతో సత్సంబంధాలు, సామరస్యం లేదని సమాచారం. కూటమిలోని మరో ప్రధాన పార్టీ ముఖ్యనేతతో సైతం సత్సంబంధాలు లేవని, కొంతమేరకు విభేదాలు కూడా వున్నాయనే ప్రచారం జరిగింది. ఎన్నికల తర్వాత ప్రభుత్వ, పాలనా వ్యవహారాల్లో ప్రాధాన్యత బాగా తగ్గిపోయింది. ఆ క్రమంలో నియోజకవర్గ ముఖ్యనేతపై వినుత మంత్రులకు ఫిర్యాదులు చేశారన్న ప్రచారం జరిగింది. వీటన్నింటి నేపథ్యంలో వినుత సన్నిహిత అనుచరులు క్రమేపీ ఆమెకు దూరమైనట్టు సమాచారం. దాని వెనుక తన రాజకీయ ప్రత్యర్థులున్నారని,వారి ప్రలోభాలతోనే తన అనుచరులు దూరమవుతున్నారని వినుత సన్నిహిత వర్గాలు అసంతృప్తితో వున్నట్టు తెలిసింది. అదే సమయంలో పీఏ శ్రీనివాసులు ఆమెకు సంబంధించిన కొన్ని వీడియోలు, ఇతర సమాచారం రాజకీయ ప్రత్యర్థులకు అందజేస్తున్నాడనే అనుమానాలు రావడంతోనే అతడిని కొట్టి వేధించారని సమాచారం.

ఎవరీ శ్రీనివాసులు?

ఆరేళ్ళుగా వినుత వద్ద డ్రైవరుగా, వ్యక్తిగత సహాయకుడిగా శ్రీకాళహస్తి మండలం బొక్కిసపాలెం గ్రామానికి చెందిన రాజేశ్వరమ్మ మనవడు శ్రీనివాసులు అలియాస్ రాయుడు పని చేసేవాడు.వారితో అత్యంత సన్నిహితంగా మెలిగేవాడు.ఈ క్రమంలో గత నెల 22వ తేదీన శ్రీనివాసులును పనిలో నుంచి తొలగిస్తున్నట్లు వినుత దంపతులు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ రాజకీయ ప్రత్యర్థుల ప్రలోభాలకు లొంగిన శ్రీనివాసులు ప్రాణ, గౌరవ అంశాలలో భంగం కలిగిస్తున్నాడన్న కారణంతో తొలగిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు.వినుతకు సంబంధించిన కొన్ని వీడియోలు, ఇతర సమాచారం రాజకీయ ప్రత్యర్థులకు శ్రీనివాసులు అందజేస్తున్నాడనే అనుమానాలు రావడంతోనే అతడిని పీఏగా తొలగించినట్టు ప్రచారం జరుగుతోంది.అనంతరం వినుత, ఆమె కుటుంబీకులు, అనుచరులు పలుమార్లు శ్రీనివాసులును నిర్బంధించి చిత్రహింసలకు గురి చేసినట్టు ఆరోపణలున్నాయి. తమ సమాచారం ఎవరు అడిగారు? ఏ సమాచారం అందజేశావు? వంటి వివరాలు రాబట్టేందుకు హింసించారని, తాము హింసించిన దృశ్యాలను వీడియో తీయడంతో ఆ సందర్భంగా శ్రీనివాసులు చెప్పిన విషయాలను కూడా వీడియో రికార్డింగ్ చేశారని సమాచారం. గత నెలలో ఒకసారి, మళ్ళీ ఈనెల ప్రారంభంలో ఒకసారి రేణిగుంట గోదాములో నిర్బంధించి చిత్రహింసలు పెట్టినట్టు ఆరోపణలున్నాయి.

రేణిగుంటలో హతమార్చి...చెన్నైలో పడవేసి...



ఈనెల 7వ తేదీన శ్రీనివాసులును రేణిగుంట గోదాముకు తీసుకెళ్ళి తీవ్రంగా కొట్టారని, ఆ సందర్భంగా కూడా వీడియోలు తీశారని, అతడు చెప్పిన సంగతులు కూడా రికార్డు చేశారని సమాచారం. బాత్‌రూమ్‌కు వెళ్ళిన శ్రీనివాసులు అందులోనే చనిపోయాడని, దాంతో వారు శ్రీనివాసులు మృతదేహాన్ని తీసుకుని రెండు కార్లలో తమిళనాడు వైపు వెళ్ళినట్టు సమాచారం. తిరువళ్ళూరు చేరుకున్నాక ఏపీ రిజిస్ట్రేషన్‌తో వున్న కారు నుంచీ మృతదేహాన్ని తమిళనాడు రిజిస్ట్రేషన్ కలిగిన కారులోకి మార్చి చెన్నై వెళ్ళినట్టు తెలిసింది. చెన్నై చేరుకున్నాక అదే రోజు రాత్రి సెవెన్ వెల్స్ ప్రాంతంలోని ఎంఎస్ నగర్ హౌసింగ్ కాలనీ వెనుక కువ్వా నది కాలువలో పడవేసినట్టు చెన్నై పోలీసుల దర్యాప్తులో తేలింది.

చెన్నై పోలీసుల దర్యాప్తులో హత్యగా నిర్ధారణ

ఈనెల 8వ తేదీన కువ్వా నది కాలువలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించడంతో మింట్ పోలీస్ స్టేషన్ పోలీసుల దృష్టికి వెళ్ళింది. వారు శవాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.పోస్టుమార్టం నివేదిక ఆ యువకుడిది హత్యేనని తేల్చి చెప్పింది.శరీరంలోపలి భాగంలో పలుచోట్ల గాయాలైనట్లు స్పష్టం చేసింది.దీంతో పోలీసులు మృతదేహం లభించిన కాలువలో మళ్లీ పడవల సాయంతో గాలించారు. ఆ సమయంలో పోలీసులకు ఓ సంచీ, మొబైల్ ఫోన్ లభ్యమయ్యాయి. ఆ సంచీలో దొరికిన ఆధారాలను బట్టి తిరుపతికి చెందిన శ్రీనివాసులుగా గుర్తించిన పోలీసులు.. మొబైల్ ఫోన్ కాల్‌డేటాను పరిశీలించారు. మృతుడి కుడి చేతిపై జనసేన పార్టీ చిహ్నం, వినుతక్క అనే టాటూ వుండడంతో చెన్నై పోలీసులకు క్లూ దొరికింది.ఆపై రంగంలోకి దిగి మృతదేహాన్ని కాలువలో పడేసిన దగ్గర నుంచీ సీసీ కెమెరాల ఫుటేజీలను రివర్సులో పరిశీలిస్తూ వెళ్ళగా తిరువల్లూరులో ఏపీ రిజిస్ట్రేషన్ వాహనాన్ని గుర్తించారు. అక్కడి నుంచీ రేణిగుంట గోదాము దాకా చేరుకున్నారు. గోదాములో సీసీ కెమెరాల ఫుటేజీలు కూడా చెన్నై పోలీసులు సేకరించినట్టు సమాచారం. ఆ ఆధారాలతో నిందితులను గుర్తించినట్టు తెలిసింది.

3 నెలలుగా టార్చర్: శ్రీనివాసులు అమ్మమ్మ

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి):తన మనవడు శ్రీనివాసులును వినుత దంపతులు 3 నెలలుగా టార్చర్ పెట్టారని అతడి అమ్మమ్మ రాజేశ్వరి తెలిపారు. చెన్నై సెవెన్‌వెల్స్ పోలీసు స్టేషన్ వద్ద 'ఆంధ్రజ్యోతి'తో రాజేశ్వరి మాట్లాడుతూ.. "నెల రోజుల క్రితం కిందపడి 3 కుట్లు పడ్డాయని తెలిసి చూడ్డానికి వెళ్లా. అతనేమీ మాట్లాడలేదు. కానీ చంద్రబాబు మాత్రం 'మీ మనవడు మా సమాచారం వేరే పార్టీ వారికి ఇవ్వబోయి దొరికిపోయాడు. మా నుంచి తప్పించుకుని పారిపోతూ బిల్డింగ్ పైనుంచి కిందపడ్డాడు' అని చెప్పాడు. అడిగితే మా మనవడు ఏడుస్తూ వుండిపోయాడు. ఒక లాయర్‌ను తీసుకొచ్చి వీడియో తీస్తూ తెల్లకాగితంపై సంతకాలు తీసుకున్నారు. అందులో వారికిష్టమొచ్చింది రాసుకున్నారు. ఆ రోజు నేను కూడా వినుత మొగుడి కాళ్ల పట్టుకున్నా.. మావాణ్ని ఏమీ చేయవద్దని. అయినా మూడు నెలల నుంచీ ఓ గోడౌన్‌లో టార్చర్ చేస్తున్నారు. వారి వద్ద ఆరేళ్లుగా పని చేస్తున్న శ్రీనివాసులు పది రోజుల క్రితం పని మానేశాడు. కానీ మళ్లీ పిలుస్తున్నారని, నాలుగు రూపాయలు సంపాదించుకుని వస్తానని వెళ్లాడు. తనకు తెలిసిన విషయాలు బయటకు చెబితే వాళ్లు చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని అన్నాడు. 'జాగ్రత్త అమ్మమ్మా' అన్నాడు. ఇంతలోకే అతన్ని చంపేశారు. నిన్న సాయంత్రం 4 గంటలకు పోలీసులు వచ్చి చెబితే గానీ అతను చనిపోయిన విషయం మాకు తెలియలేదు."



వినుత సహా ఐదుగురి అరెస్టు



నిందితులు కోట వినుత, కోట చంద్రబాబు, గోపి, షేక్ తస్సాన్, శివకుమార్

శ్రీనివాసులు హత్య కేసులో జనసేన ఇంచార్జి వినుత, ఆమె భర్త కోట చంద్రశేఖర్ (చంద్రబాబు),వారి వద్ద డ్రైవర్లుగా పనిచేసే రేణిగుంటకు చెందిన తస్సం(28), తొట్టంబేడు మండలం సింగమాలకు చెందిన గోపి(24), వారి ప్రధాన అనుచరుడుగా ఉన్న బొక్కిసంపాళెంకు చెందిన శివకుమార్(34)ను తమిళనాడు పోలీసులు అదుపులోకి తీసుకుని చెన్నైకు తరలించారు.వారి నుంచీ ల్యాప్‌టాప్ సహా శ్రీనివాసులును హింసించిన వీడియోలు, అతడు చెబుతుండగా రికార్డు చేసిన వీడియోలు కూడా స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.శనివారం రాత్రి నిందితులను చెన్నైలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

జనసేన నుంచి బహిష్కరణ

జనసేన పార్టీ నుంచి వినుతను బహిష్కరిస్తున్నట్లు శనివారం ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న వినుత వ్యవహార శైలి పార్టీ విధానాలకు విరుద్ధంగా వుండడంతో కొంతకాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఆమెపై చెన్నైలో హత్య కేసు నమోదు కావడం పార్టీ దృష్టికి రావడంతో వినుతను బహిష్కరిస్తున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు.

తిరుపతికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

- సూపర్ స్వచ్‌లీగ్ కేటగిరీలో కార్పొరేషన్ ఎంపిక
- ఈనెల 17న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

తిరుపతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్ఠాత్మకంగా అందించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు తిరుపతి నగరపాలక సంస్థ ఎంపికైంది. 3 లక్షల జనాభా కేటగిరీలో తిరుపతి నగర కార్పొరేషన్ సూపర్ స్వచ్ఛ లీగ్‌ను కైవశం చేసుకుంది. ఈ నెల 17న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. పరిశుభ్రమైన పరిసరాల ద్వారా ఆరోగ్యకర సమాజం సాధించే లక్ష్యంతో ప్రధాని మోదీ రూపొందించిన స్వచ్ఛ భారత్ విప్లవం కొనసాగుతోంది. ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో అవార్డులను ప్రకటిస్తూ మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను ప్రోత్సహిస్తోంది. తిరుపతి నగరపాలక సంస్థ అవార్డుకు ఎంపిక కావడం పట్ల కమిషనర్ ఎన్.మౌర్యతో పాటు పలువురు నగర ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలోని అధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది, నగర ప్రజల సహకారంతోనే ఈ అవార్డు సాధించగలిగామని అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించగలుగుతామని ధీమా వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్ గేమ్‌లతో అప్పుల పాలై యువకుడి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి అప్పులపాలై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దకాపులేఅవుట్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ గిరిబాబు వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలానికి చెందిన మురళి(33) కొన్ని రోజులుగా తిరుపతి పెద్దకాపు లేఅవుట్‌లో కాపురముంటూ మసాలా ప్యాకెట్లు మార్కెటింగ్ చేస్తున్నాడు. ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడ్డాడు. స్నేహితుల నుంచి రూ.పది లక్షల వరకు అప్పు చేశాడు.వడ్డీ పెరిగిపోవడంతో అప్పు తీర్చలేకపోయాడు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరిగింది.ఈ విషయమై గొడవలు జర గడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన మురళి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

కాలిఫోర్నియా బిజినెస్ స్కూల్లో పుత్తూరు విద్యార్థికి ప్రవేశం



అఖిల్ నీలం



ఢిల్లీ అశోక యూనివర్సిటీ నుంచి తల్లిదండ్రులతో కలిసి మాస్టర్స్ డిగ్రీ అందుకున్న అఖిల్

పుత్తూరు, జూలై12(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన అఖిల్ నీలం ప్రఖ్యాత విద్యా సంస్థ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ ప్రవేశంతో పాటు ప్రతిభకు గుర్తింపుగా రూ.80 లక్షల స్కాలర్‌షిప్ పొందారు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ బిజినెస్ స్కూల్‌లోనూ సీటు వచ్చినా కాలిఫోర్నియా స్కూల్‌నే ఎంపిక చేసుకున్నారు. ఢిల్లీ అశోక యూనివర్సిటీ, ఐస్‌ల్యాండ్‌లలో మాస్టర్స్ డిగ్రీలు చేశారు. తాను స్థాపించిన సెంటర్ ఫర్ జెండర్ అండ్ పాలిటిక్స్(సీజీపీ) అనే సంస్థ రాజకీయాల్లో మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడం, సాధికారతను సాధించడం వంటి అంశాల మీద పనిచేస్తుందని అఖిల్ తెలిపారు. ఈ విషయమై ఓ పుస్తకాన్ని రచించి ఐస్‌ల్యాండ్ అధ్యక్షురాలు హల్లా టోమాస్‌డోట్టిర్‌కు సమర్పించానని వివరించారు. ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలలో విద్యాశాఖకు సంబంధించి పాలసీ కన్సల్టెంట్‌గా ప్రత్యేకించి గత టీడీపీ ప్రభుత్వంలో ఆనంద వేదిక కార్యక్రమాన్ని రూపొందించినట్టు వెల్లడించారు. తనకు ఇంతటి గుర్తింపు రావడం వెనుక తల్లిదండ్రులు విశ్రాంత ఉపాధ్యాయుడు నీలం ప్రభాకర్. అంజలి శ్రమ ఎంతో ఉందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో యువకుడి పరిస్థితి విషమం



మనోజ్ కృష్ణ (పాత చిత్రం)

శ్రీకాళహస్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని పూతలపట్టు-నాయుడుపేట రహదారి అండర్‌పాస్ వంతెనపై ముచ్చువోలు క్రాస్ రోడ్డు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కొండూరు గ్రామానికి చెందిన మనోజ్‌కృష్ణ, అశోక్(20), అభి(21), పవన్(24), అజయ్(24) కారులో శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు బయలుదేరారు. శ్రీకాళహస్తి శివారులోని ముచ్చువోలు క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళుతున్న లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో మనోజ్‌కృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన వారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అశోక్ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



తీవ్రంగా గాయపడిన అశోక్

జగన్ రెడ్డికి తీర్థయాత్రలే గతి

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ధ్వజం

గంగాధరనెల్లూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'జగన్ రెడ్డీ నువ్వేమో దండయాత్రలు చేస్తావు..నీ చెంచాగాళ్లతో పాత్రికేయ మిత్రులపై దాడులు చేయిస్తావు.. ఇకనైనా రైతుల విషయంలో రాద్ధాంతం ఆపకపోతే ఆఖరికి తీర్థయాత్రలకే పోతావు' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు.విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు,ప్రభుత్వ విప్ వీఎం థామస్‌లతో కలసి శనివారం గంగాధరనెల్లూరు మండలంలో ఆయన పర్యటించారు.గంగాధరనెల్లూరులోని ఎంపీడీవో కార్యాలయం పక్కన రూ.61లక్షలతో నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవనానికి భూమి పూజ చేశారు. నెల్లేపల్లెమిట్టలో రూ.25లక్షలు,చిన్నమిట్టపల్లెలో రూ.15లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. నెల్లేపల్లె దళితవాడలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్ళి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.అనంతరం మీడియా సమావేశంలో రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మూడురోజుల క్రితం మాజీ సీఎం జగన్‌రెడ్డి బంగారుపాళ్యం పర్యటనకు వచ్చి మామిడిపంటను రోడ్డుపాలు చేసి ట్రాక్టర్లతో తొక్కించి నాశనం చేశారంటూ ధ్వజమెత్తారు.

సూళ్లూరుపేటలో భారీగా గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి సూళ్లూరుపేట మీదుగా చెన్నైకి రవాణా
- రూ.20 లక్షల విలువ చేసే గంజాయి ప్యాకెట్లు, కారు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు

సూళ్లూరుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి చెన్నైకి తీసుకెళ్తున్న రూ.20 లక్షల విలువ చేసే 70.560 కిలోల గంజాయిని సూళ్లూరుపేట పోలీసులు శనివారం పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సూళ్లూరుపేట పోలీసుస్టేషన్‌లో శనివారం ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మానాయుడు, తడ ఎస్ఐ కొండపనాయుడు సూళ్లూరుపేట హోలిక్రాస్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. నెల్లూరు వైపు నుంచి చెన్నై వెళ్తున్న ఏపీ 09 సీటీ 2966 నంబరు కారును తనిఖీ చేశారు. వెనుక సీటు, డిక్కీలో నాలుగు బ్యాగ్‌లలో 70.560 కిలోల గంజాయి ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న తమిళనాడుకు చెందిన టీ.బిబిన్‌నాథ్, జే.రోహన్‌ను అదుపులోకి తీసుకుని కారుతో సహా పోలీసుస్టేషన్‌కు తరలించారు. విచారించగా ఒడిశాలో తక్కువ ధరకు కొనుగోలు చేసి చెన్నైలో అధిక ధరలకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి, వారి వద్దనున్న రెండు సెల్‌ఫోన్లు, రూ.20 లక్షల విలువ చేసే గంజాయి, కారును సీజ్ చేశారు. నిందితులు తమిళనాడులో గంజాయి రవాణా, హత్య కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.

వేకువజామున ఇంట్లో చోరీ

30 సవర్ల బంగారు ఆభరణాల అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

గూడూరు అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గమళ్లపాళెం ప్రాంతంలో ఓ ఇంట్లో శనివారం వేకువజామున చోరీ జరిగింది. ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు తెలిపిన మేరకు వివరాలు... గమళ్లపాళెం ప్రాంతంలో నివాసముంటున్న శివయ్య నిమ్మ కాయల వ్యాపారం చేస్తుంటాడు. ఆగస్టులో తన కుమార్తె వివాహం ఉండడంతో 30 సవర్ల బంగారు ఆభరణాలను ఇంట్లో భద్రపరిచాడు. శనివారం వేకువజామున 3గంటల సమయంలో శివయ్య కుటుంబ సభ్యులు పనుల నిమిత్తం నెల్లూరుకు వెళ్లారు. అతని కుమారుడు చైతన్య ఇంట్లోనే నిద్రిస్తున్నాడు. అదే సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగలగొట్టి అందులో ఉన్న 30 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకు వెళ్లారు. ఉదయం నిద్రలేచిన చైతన్య చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ గీతాకుమారి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, గమళ్లపాళెం సమీపంలోని అశోక్‌నగర్‌లో కూడా ఓ ఇంట్లో చోరీ జరిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

ఏడాదిలో ఎంతో అభివృద్ధి చేశాం: విజయశ్రీ



కాదలూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి ముందు అరాచకం... అభివృద్ధి కానరాక ఎంతో ఇబ్బందులు పడ్డ నియోజకవర్గం సంవత్సర కాలంలోనే ఎంతో అభివృద్ధి జరిగిందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం మండల పరిధిలోని కాదలూరు, వెండ్లూరుపాడు, మాంబట్టు, అండగుండాల, చేనిగుంట గ్రామాల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరించి కరపత్రాలను అందజేశారు. గ్రామస్తుల నుంచి సమస్యలను తెలుసుకొని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు రూ.2 కోట్ల వ్యయంతో తడ మండలంలో రోడ్లు, మురుగుకాలువలు నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్‌నాయక్, టీడీపీ నాయకులు సెల్వం, వేలూరు చంద్రయ్య, బొమ్మన పళణి, శ్రీధర్, వేనాటి రాజారెడ్డి, రవి, జయపాల్, బాలిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మస్తాన్, గాబ్రియల్, పలుశాఖల అధికారులు, పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పరుగులు



పెదగోవిందపల్లిలో కరపత్రాలను చూపుతున్న టీడీపీ నేతలు

కోట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు తీస్తోందని తెలుగు యువత మండల అధ్యక్షుడు చల్లా సురేష్ గౌడ్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు వాటంబేటి చెంగల్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీ పెదగోవిందపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు పర్యటించి ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివకృష్ణ, సుమన్, మస్తాన్, రాజా, మురళి, వెంకటకృష్ణయ్య, దామరపు మురళి, నవకోటి, అంకబాబు, ప్రభాకర్, ఖాదర్‌బాషా, వరప్రసాద్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత ఏడుకొండలుకు నేతల నివాళి



ఏడుకొండలుకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పెన్నేపల్లి గ్రామానికి చెందిన కోవూరు ఏడుకొండలు(47) శుక్రవారం మృతి చెందగా శనివారం అంత్యక్రియలు జరిగాయి. పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు. ఏడుకొండలు టీడీపీలో చురుకైన పాత్ర పోషిస్తూ క్రియాశీల నాయకుడుగా సేవలందించారని కంటతడి పెట్టారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పునబాక పోలయ్యతో కలిసి పాడె మోశారు. అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచు, టీడీపీ నాయకుడు గాలి రమేష్‌నాయుడు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే వేలూరు హరి నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, యాళ్ల యుగంధర్‌గౌడ్, దామతోటి సుబ్రహ్మణ్యం, గుంటపూడి గురవయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పేరం రమేష్‌నాయుడు, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, కాటూరు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, కలవకోలు మునీష్ తదితరులు ఏడుకొండలు మృతదేహానికి నివాళులర్పించారు.

పుదుచ్చేరి పోలీసుల అదుపులో నాయుడుపేట యువకులు

నాయుడుపేట టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణానికి చెందిన ఇద్దరు యువకులను పుదుచ్చేరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాండిచ్చేరిలో కొన్ని కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తికి నాయుడుపేట నుంచి ఇద్దరు యువకులు ఫోన్ చేసి ఉండటంతో పుదుచ్చేరి పోలీసుల బృందం శనివారం తెల్లవారుజామున ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుంది.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

కోట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు శనివారం తెలిపారు. మధురైకు చెందిన అరవింద కంటి ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి తిరుపతిలోని అరవింద కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు.

నేటి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

గూడూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళతామని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు.



పిచ్చిమొక్కల మధ్య గృహనిర్మాణశాఖ, విద్యాశాఖ కార్యాలయాలు - తడకండ్రిగ సచివాలయం దారిలో అడ్డంగా పడి ఉన్న చెట్టు

చిట్టడవిలా ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం

తడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తడలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం చిట్టడవిని తలపిస్తోంది. తహసీల్దారు, ఎంపీడీవో, విద్యాశాఖ, గృహనిర్మాణం, వ్యవసాయం, తడ కండ్రిగ సచివాలయం-2, వెలుగు కార్యాలయం, పీహెచ్‌సీ తదితర కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ముఖ్యంగా వ్యవసాయ, విద్య, గృహనిర్మాణశాఖ, పీహెచ్‌సీ ఉన్న చోట దట్టమైన గుబురు చెట్లు పెరిగిపోవడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. తహసీల్దారు కార్యాలయం నుంచి తడ కండ్రిగ సచివాలయం-2కు వెళ్లే దారిలో గత తుఫాన్ సమయంలో విరిగిపడిపోయిన చెట్లు రాకపోకలకు అడ్డంగా ఉన్నా వాటిని తొలగించలేదు. గ్రామాలు అందంగా ఉండాలని, ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించే అధికారులు తమ కార్యాలయ పరిసరాలపై దృష్టి సారించకపోవడం శోచనీయం.

అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా: కురుగొండ్ల

వెంకటగిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): తాను అవినీతికి పాల్పడుతున్నట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సవాల్ విసిరారు. పట్టణ పరిధిలోని 24వ వార్డు పెరుమాళ్ళస్వామి గుడి వీధిలో నిర్వహించిన సుపరినపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయో లేదోని ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. వార్డుల్లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కురుగొండ్ల మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి చేసిన విమర్శలకు ఘాటుగా స్పందించారు. చుట్టపుచూపుగా వచ్చి టైం పాస్ రాజకీయాలు చేసే రాంకుమార్ రెడ్డికి ఏం తెలుసని ప్రశ్నించారు. ఆయన చేసిన ఆరోపణలు నిరూపించాలని, లేని పక్షంలో చవకబారు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతిని చూసిన ప్రజలు ఆ పార్టీకి 11 సీట్లుతో సరిపెట్టారని చెప్పారు. అవినీతికి పాల్పడిన వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రస్తుతం జైలు ఊచలు లెక్కపెడుతున్నారని, త్వరలో జగన్ కూడా జైలుకు వెళ్లడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పోరేషన్ డైరక్టర్ శ్రీరాందాస్ గంగాధరం, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరరావు, జానపాటి బాలకృష్ణ, మేరిగ రామకృష్ణ, మంకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన: పాశం



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని నెర్నూరు, కొమ్మనేటూరు పంచాయతీల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక ప్రజలను రెచ్చగొడుతూ వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ధృడసంకల్పంతో ముందుకు వెళుతున్నామన్నారు. అభివృద్ధి కాంక్షించే ప్రజలందరూ ప్రభుత్వానికి తోడుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, నాగేశ్వరరావు, దుద్దా రాఘవరెడ్డి, శీనయ్య, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అత్తివరంలో పోలీసు బందోబస్తు

ఓజిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం అత్తివరంలో శనివారం ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామానికి టీడీపీ నేత ఎల్లు గురుమూర్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అందులో హత్య కోణం బయటపడిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులు పరారీలో ఉన్నారు. వీరికి బంధువైన పాల్చూరు పుల్లయ్య భార్య జయమ్మ(80) శనివారం మృతి చెందింది. దీంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు గురుమూర్తి హత్య కేసులో నిందితులు అత్తివరం గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో ఘర్షణలు చోటుచేసుకునే అవకాశం ఉంటుందని భావించిన పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. గురుమూర్తి వర్గంతో సీఐ, ఎస్ఐ చర్చలు జరిపి ఎలాంటి ఉద్రిక్తత చోటుచేసుకోకుండా అంతయక్రియలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు. ఆలయ ఆవరణలో మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను ఊరేగించారు.

సత్యసాయిబాబా గ్రామోత్సవం



వెంకటగిరి టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): పుటపర్తి సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రాజా కుటుంబీకులు వీబీ సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞ యాచేంద్ర ఆధ్వర్యంలో శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం కాశీవిశ్వనాథ స్వామి ఆలయం నుంచి సాయిబాబా చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

ఎస్సీ వసతి గృహంలో ఎంపీడీవో తనిఖీలు



వంటలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో మనోహర్ గౌడ్

చిట్టమూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిట్టమూరులోని ఎస్సీ వసతి గృహాలను శనివారం ఎంపీడీవో మనోహర్ గౌడ్ తనిఖీ చేశారు. విద్యార్థులకు వండి పెందుతున్న ఆహార పదార్థాలను రుచి చూశారు. విద్యార్థులు నిద్రించే గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. ఆయనతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, ఏఎస్‌డబ్ల్యూవో మనోజ్ కుమార్, వార్డెన్ మహేంద్ర ఉన్నారు.

అన్నదానం

సూళ్లూరుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటకు చెందిన లయన్స్ క్లబ్, షార్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సెంటర్‌లో అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యుడు పీఆర్‌సీ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆర్-5 రీజియన్ కార్యదర్శి ఆదిశేషారెడ్డి, అధ్యక్షురాలు లలిత, కార్యదర్శి అరుణకుమారి, కోశాధికారి జానకి పాల్గొన్నారు.

టీడీపీ నేతకు ఎమ్మెల్యే నివాళి



ప్రభాకర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాశం

కోట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌కు చెందిన టీడీపీ నాయకులు పెల్లూరు ప్రభాకర్‌రెడ్డి శనివారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ నివాళులర్పించారు. ప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, పెన్నక్కచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాళెం సర్పంచు కోకర్ల మధుయాదవ్ తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

సూళ్లూరుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్‌వీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 29 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారికి చెన్నై శంకర నేత్రాలయలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని ఫౌండేషన్ చైర్మన్ విజయలక్ష్మి తెలిపారు.

డాక్టర్ పీర్‌కుమార్‌కు ఎన్టీఆర్ జాతీయ అవార్డు

గూడూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): గూడూరు ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ బద్రి పీర్‌కుమార్‌కు ఎన్టీఆర్ జాతీయ అవార్డు దక్కింది. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ ఎన్టీ రామారావు, భారతరత్న పీవీ.నరసింహారావు జయంతి ఉత్సవాలు-2025 శనివారం శ్రీత్యాగరాయ గానసభ, కళా వెంకటదీక్షితులు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్‌లో జరిగాయి. తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌజన్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి ప్రతిభావంతులకు ఎన్టీఆర్, పీవీ నరసింహారావు జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. డాక్టర్ బద్రి పీర్‌కుమార్‌ను ఎన్టీఆర్ జాతీయ అవార్డుతో గుర్రం జాషువా వారసురాలు అమృతపూడి రేవతి, ఝాన్సీ లక్ష్మీబాయి వారసురాలు ఎస్.శాంతా బాయి, సరస్వతీ ఉపాసకులు దైవిజ్ఞశర్మ, తదితరులు ఘనంగా సత్కరించారు. ఈయన 26 ఏళ్లుగా అధ్యాపకుడిగా, నటుడిగా, రచయితగా, ప్రతిభ కనపరుస్తూ విద్య, సినిమా, టీవీ, నాటక కళా రంగానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా, కళాకారుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తించి ఈ అవార్డు అందజేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ అవార్డు రావడంతో తన బాధ్యత మరింత పెరిగిందని విద్య, కళారంగానికి తనవంతు సేవలు అందిస్తుంటానని పీర్‌కు మార్ తెలిపారు.



ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకుంటున్న డాక్టర్ బద్రి పీర్‌కుమార్

224 అంగన్‌వాడీ కేంద్రాలకు ముగ్గురే సూపర్ వైజర్లు

కోట, జూలై 12(ఆంధ్రజ్యోతి): కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో పనిచేసేందుకు అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ఆసక్తి చూపడంలేదు. ఇటీవల చిట్టమూరు మండలంలోని ముగ్గురు సూపర్ వైజర్లలో గూడూరు ప్రాజెక్టుకు ఒకరు, సూళ్లూరుపేట ప్రాజెక్టుకు ఇద్దరు బదిలీ అయ్యారు. ఆ స్థానాల్లో పనిచేయడానికి ఇతర మండలాల్లోని అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ఆసక్తి చూపలేదు. దీంతో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు పనిసర్దుబాటు పేరిట కోట మండలంలో ఉన్న ముగ్గురు సూపర్ వైజర్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 224 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో 18 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటన్నింటినీ ముగ్గురు సూపర్ వైజర్లే పర్యవేక్షించాల్సి వస్తోంది. ఆయా మండలాలకు తిరుగుతూ పని చేయాల్సి వస్తుండడంతో సూపర్ వైజర్లపై పనిభారం పెరుగుతోంది. ఈ విషయమై సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ కోట ఐసీడీఎస్ పరిధిలో సూపర్ వైజర్ల కొరత గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలోనే ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు.

పగలు భగభగ... రాత్రి ఉక్కపోత

వేసవిని తలపిస్తున్న ఎండలు



నిర్మానుషంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు సెంటర్

సూళ్లూరుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జూలై మాసంలోనూ వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. వేసవిలో చిరు జల్లులతో చల్లబడిన వాతావరణం జూలైలో ఒక్కసారిగా వేడెక్కింది. సూళ్లూరుపేటలో శనివారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వాస్తవానికి మే నెలలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. అయితే ఈ ఏడాది ముందుగానే తొలకరి వానలు పలకరించాయి. తరచూ తేలికపాటి జల్లులు పడడంతో ఎండల బాధలు తప్పి చల్లటి వాతావరణం కొనసాగుతుందని అందరూ భావించారు. అయితే అనూహ్యంగా జూలైనూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నెల ఆరంభం నుంచే భానుడు భగభగమంటున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ఎవరూ బటయకువెళ్లలేని పరిస్థితి. మధ్యాహ్నం అయ్యే సరికి పట్టణంలో ప్రధాన రోడ్లు, వ్యాపార కూడళ్లు నిర్మానుషంగా మారుతున్నాయి. జనసంచారం తగ్గిపోవడంతో కర్ఫ్యూ వాతావరణం తలపిస్తోంది. అధిక ఉష్ణోగ్రతలకు తోడు వేడిగాలులు వీస్తున్నాయి. రాత్రి వేళల్లో తీవ్ర ఉక్కపోతతో చిన్నపిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

గూడూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీన పట్టణంలో జరగనున్న కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్దనరెడ్డి పాల్గొంటారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తొలి అడుగు కార్యక్రమలో పాల్గొనేందుకు మంత్రి జనార్దనరెడ్డి గూడూరుకు వస్తున్నారని తెలిపారు. తమ ప్రాంతాల్లో రోడ్ల సమస్యలను తెలియజేస్తే మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, వాటంబేడు శివకుమార్, బిల్లు చెంచురామయ్య, ఇశ్రాయికుమార్, లీలావతి, జలీల్, నరసింహులు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ విస్తరణకు భూములిచ్చిన రైతులకు నష్ట పరిహారం అందించండి

నాయుడుపేట, జులై 12(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం అందిచాలని నాయుడుపేటకు చెందిన బీజేపీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి విజయ భాస్కర్, జిల్లా మాజీ కార్యదర్శి ఆశ చెంచు కృష్ణయ్య వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్మవరంలో శనివారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామంలో సర్వే నెంబర్ 7-1, 6-1ఎ, 4-2, 6-బి, 6-1బి లో భూములను హైవే విస్తరణలో రైతులు కోల్పోయారన్నారు. అధికారుల చుట్టూ తిరుగుతున్న పరిహారం అందలేదని వివరించారు. జిల్లా కలెక్టర్, జాతీయ రహదారుల సంస్థ అధికారులతో మాట్లాడి రైతులకు పరిహారం అందేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు బీజేపీ నేతలు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొప్పోల సుబ్రహ్మణ్యం, పి.వీరయ్య తదితరులు ఉన్నారు.


ఎన్నికల హామీలను నెరవేర్చాలి

సూళ్లూరుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామిలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో టీడీపీ మేనిఫెస్టోను గుర్తుచేశారు. ఈ సందర్భంగా కిలివేటి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే రూ.2 లక్షల కోట్లకు పైన అప్పులు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ముత్తు సెంథిల్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర మంత్రులుఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, బీసీసీఐ స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్ అంకిత్ కలియార్, సినీ హీరో సంతోష్ శోభన్, నటుడు అశోక్ బాబు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.




ఆనం రామనారాయణరెడ్డి - కొల్లు రవీంద్ర - సంతోష్ శోభన్ - అశోక్‌బాబు


అతి త్వరలో వంద భాషల్లో శ్రీమద్ భగవద్గీత

● గాయకుడు గజల్ శ్రీనివాస్



తిరుమల, జూలై12(ఆంధ్రజ్యోతి): శ్రీమద్ భగవద్గీతను అతి త్వరలో నూరు భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏడాదిగా శ్రీమద్ భగవద్గీతను నూరు భాషల్లో చేయాలనే యజ్ఞంలో కృషి చేస్తున్నామన్నారు. తెలుగు, సంస్కృతంలో తాను పాడిన భగవద్గీతను తిరుపతిలో విడుదల చేసి స్వామికి అంకితం చేస్తామన్నారు.

శ్రీహరి దర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.84 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 70,217

తలనీలాలు సమర్పించినవారు: 31,155

ప్రీ-నేషనల్స్‌కు జిల్లా షూటర్స్ ఎంపిక



ప్రీ-నేషనల్స్‌కు ఎంపికైన జిల్లా షూటర్స్

తిరుపతి(క్రీడలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఎన్టీఆర్ కేవీకే 10మీటర్ల ఎయిర్ రైఫిల్/పిస్టల్ షూటింగ్ కేంద్రంలో శిక్షణ పొందిన పదిమంది షూటర్లు ప్రీ-నేషనల్స్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రేంజ్‌లో ఇటీవల హైదరాబాదు గచ్చిబౌలిలో రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 11మంది ప్రాతినిథ్యం వహించారు. ఇందులో లవకుమార్, సాయిఅచ్యుత్‌రాయల్, హేమచంద్, పురుషోత్తం, భార్గవి, హస్విత, యోక్షిత, నందగోపాల్, హితేష్, వైష్ణవీలు నేషనల్స్‌కు ఎంపికయ్యారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ కేవీకేలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.దేవరాజ్, డీఎస్‌డీవో శశిధర్ ఆధ్వర్యంలో క్రీడాకారులను సన్మానించి, అభినందించారు. సంఘం ఉపాధ్యక్షుడు సిద్ధయ్య, కార్యదర్శి డాక్టర్ భానుప్రకాష్, జయరాజ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



గ్రాప్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మాణిక్యాలు

తిరుపతి(క్రీడలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య కూడలి సమీపంలోని గిరిజన భవన్‌లో శనివారం సాయంత్రం 5వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఏపీ క్రీడా భారతి అధ్యక్షుడు ఎం.వి.మాణిక్యాలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. సబ్ జూనియర్, క్యాడెట్(బాలబాలికలు) విభాగాల్లో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన అథ్లెట్లను ఆయన పరిచయం చేసుకున్నారు. క్రీడల ద్వారా యువతలో శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ క్రీడా భారతి కార్యదర్శి ధనంజయరెడ్డి, సంయుక్త కార్యదర్శి సురేంద్ర రెడ్డి, డీఎస్‌డీవో ఎన్.శశిధర్, ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు రేఖారాణి పాల్గొన్నారు.

చంద్రగిరిలో మ్యాట్రిక్ థర్మల్ 4 డ్రోన్‌తో నైట్ బీట్

● చిమ్మచీకట్లో ఆటోలో మద్యం తాగిన నలుగురి గుర్తింపు



యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

చంద్రగిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తొండవాడ, బీడీ కాలనీ, జడ్పీ హైస్కూల్ ప్రాంతంలో పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి మ్యాట్రిక్ థర్మల్ 4 డ్రోన్ కెమెరాతో నైట్ బీట్ నిర్వహించారు. తొండవాడ జాతీయ రహదారి సమీపంలోని చెట్ల పొదల్లో చీకట్లో ఓ ఆటోలో నలుగురు వ్యక్తులు మద్యం తాగుతున్న దృశ్యాలు ఇందులో రికార్డు అయ్యాయి. వెంటనే డ్రోన్ టీమ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత్రి 8 గంటల తర్వాత పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం ఉంటుందన్న విషయాన్ని గుర్తు చేశారు.

హిందూ ఆలయాల యువచైతన్య మహాపాదయాత్ర ప్రారంభం



ఎర్రావారిపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) హిందూ దేవాలయాల యువచైతన్య మహాపాదయాత్రను శ్రీభువనగిరి పీఠాధిపతి కమలానంద భారతి ఆధ్వర్యంలో శనివారం తలకోన నుంచి ప్రారంభమైంది. 8నెలల పాటు సాగే పాదయాత్ర గురించి ఆయన మాట్లాడుతూ 'భగవద్భక్తి-కర్తవ్యదీక్ష-సమాజశక్తి' నినాదంతో తలకోన నుంచి సాధుసంపత్‌లు యాత్ర సంకల్పించారని చెప్పారు. సనాతన హైందవ ధర్మపరిరక్షణ, దేవాలయాలు, సంస్కృతాంధ్ర భాషా పరిరక్షణ, హిందూ యువ చైతన్యం లక్ష్యాలతో యాత్ర కొనసాగుతుందని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి, కర్నూలు, అనంతపురం, నారాయణపేట, గద్వాల్, వనపర్తి, నంద్యాల, కడప, నెల్లూరు జిల్లాల్లో 6 నెలల్లో 8 వేల గ్రామాల్లో పాదయాత్ర జరుగుతుందని వివరించారు. ఫిబ్రవరిలో తిరుపతిలో ధార్మిక మహాసమావేశంతో ముగియనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు రాఘవులు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, టీడీపీ నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు హేమంబరధర నాయుడు, తలకోన ట్రస్ట్ చైర్మన్ సోమనాథరెడ్డి, ఈవో రవీంద్రరాజు, టీడీపీ మండల నాయకులు గోపి, కేశవుల నాయుడు పాల్గొన్నారు.

గజరాజుల కట్టడికి యాక్షన్‌ప్లాన్

● దక్షిణాది రాష్ట్రాల సమాలోచనలు ● నోడల్ కమిటీకి నివేదిక అందజేసిన సబ్ కమిటీ



మంగళం, జూలై 12(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగుల దాడులు పెద్దసమస్యగా మారింది. ఈ క్రమంలో 2024 డిసెంబరు 18న తమిళనాడు మాజీ పీసీసీఎఫ్ సంజయ్ కె శ్రీనివాస్ చైర్మన్‌గా ఆరుగురితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సబ్ కమిటీ తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో ఏనుగుల సంతతి, వాటి కదలికలు, ప్రజల ఆస్తులు, ప్రాణాలకు నష్టం కలగకుండా ఎలా కట్టడి చేయాలి అనే దానిపై యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. పూర్తి స్థాయిలో పరిశీలించి, నివేదికను నోడల్ కమిటీకి అందజేసింది.

ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల పరిశీలన

దక్షిణాది రాష్ట్రాల సంయుక్త ఆధ్వర్యంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో ఏర్పడిన నోడల్ కమిటీ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఏనుగులు ప్రవేశించే, అవి తిరిగి వెళ్లే మార్గాలను రెండు రోజుల క్రితం పరిశీలించింది. ఏనుగులు ఎక్కువగా సంచరిస్తున్న పలమనేరు, తలకోన, కల్లూరు, భీమవరం, బాలపల్లి, మామండూరు.. తిరుమల నడక మార్గంలోని ఏడవ మైలును సందర్శించింది. శేషాచల కొండల్లోకి వస్తున్న ఏనుగులు సమీప భాకరాపేట, కల్లూరు, మామండూరు, బాలపల్లి, భీమవరం తదితర ప్రాంతాల్లో పంటలపై దాడి చేస్తున్న విషయాలను అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. అనేక సందర్భాల్లో రైతుల ప్రాణాలను కూడా బలి తీసుకున్నట్లు ఆయా ప్రాంతాల వారు కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలోనూ ఈ కమిటీ పర్యటిస్తోంది. కేరళ నుంచి తమిళనాడు, కర్ణాటక మీదుగా ఆంధ్ర రాష్ట్రంలోకి ఏనుగుల మంద ఎప్పుడు వచ్చింది.. అందులో ఎన్ని ఏనుగులు ఉన్నాయి.. అవి ప్రయాణించే మార్గం, ఎక్కడెక్కడ ఎంతకాలం ఉంటున్నాయి.. ఆ సమయంలో జరుగుతున్న ఆస్తి, ప్రాణ నష్టాల గురించి తెలుసుకుంటున్నారు. ఆ తర్వాత వీటిని నిలువరించడానికి గల అవకాశాలను పరిశీలిస్తారు. అదే సమయంలో అవసరమైన ఆహారం, నీరు పుష్కలంగా లభించే ప్రాంతాలను గుర్తిస్తారు. వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపైనా కసరత్తు చేస్తున్నారు. వీటన్నింటిపై పూర్తి స్థాయిలో నివేదిక రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తారు. కమిటీ తీసుకున్న నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయగలిగితే మేలు జరిగే అవకాశముంటుందని రైతులు భావిస్తున్నారు.

ఏనుగులు తిరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న నోడల్ కమిటీ సభ్యులు




ఘనంగా వేద విశ్వవిద్యాలయ వార్షికోత్సవం

● సుదర్శన సహిత పారమాత్మిక హోమం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ 20వ వార్షికోత్సవం అత్యంత వేడుకగా సాగింది. ఉదయం సుదర్శన సహిత పారమాత్మిక హోమం చేపట్టారు. అనంతరం నిర్వహించిన సభలో వీసీ ప్రొఫెసర్ రాణిసదాశివమూర్తి, రిజిస్ట్రార్ భాస్కరుడు పాల్గొని మాట్లాడారు. టీటీడీ సహకారంతో రెండు దశాబ్దాలుగా వేద విజ్ఞాన వ్యాప్తిలో వేద యూనివర్సిటీ ఎంతో కృషి చేసిందన్నారు. ఎంతో మంది వేద పండితులను తీర్చిదిద్దిందని తెలిపారు. వేద విజ్ఞానంపై విలువైన పరిశోధనలు సాగాయన్నారు. అనేక విలువైన వేద సంబంధ గ్రంథాలు ప్రచురించినట్టు చెప్పారు. అనేక మంది వేద పండితులు యూనివర్సిటీని సందర్శించారని తెలిపారు. వేద సంబంధ విషయాలపై సదస్సులు, వర్క్‌షాప్‌లు చేపట్టినట్టు వివరించారు. వేద, ఆగమ, పౌరోహిత్య, వేదాంగ, వేద భాష్యాలపై విస్తృత అధ్యయనం సాగుతున్నట్టు వివరించారు. శ్రీవారి అనుగ్రహం, టీటీడీ అధ్యక్షులు, ఈవోల సహకారంతో ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు. విద్యార్థులకు వస్త్రాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేద విశ్వవిద్యాలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు

వార్షికోత్సవ వేళ రాజకీయ వివాదం!

● హాజరుకాని బీజేపీ, టీడీపీ నాయకులు

వేద విశ్వవిద్యాలయ వార్షికోత్సవ వేళ రాజకీయ వివాదం రేగింది. టీటీడీ సహకారంతో నిర్వహిస్తున్న వేద విశ్వవిద్యాలయం వార్షికోత్సవానికి టీటీడీ చైర్మన్‌ను, ఈవోను, యూనివర్సిటీ అధికారులను ఆహ్వానించలేదనే ఆరోపణలు వినిపించాయి. దీనికి కారణాలు ఏమిటనే విషయాన్ని పక్కనపెడితే స్థానిక బీజేపీ, టీడీపీ నేతలను మచ్చిక చేసుకోవడానికి వేద వర్సిటీ ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారనే విమర్శ తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో పలు అధికారిక హోదాల్లో ఉన్న స్థానిక బీజేపీ, టీడీపీ నాయకులను వార్షికోత్సవానికి ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికలోనూ వారి పేర్లను ముద్రించారు. అయితే తుదకు వారు కార్యక్రమానికి హాజరుకాలేదు. ఇలాంటి పరిస్థితుల మధ్య వేద వర్సిటీ వార్షికోత్సవం సాగింది. ఈ వివాదం ఎక్కడికి దారి తీస్తుందనేది ఆసక్తిగా మారింది.

విమానాశ్రయ ప్రైవేటీకరణను ఆపండి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్



నిరసన తెలుపుతున్న చింతామోహన్

రేణిగుంట, జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రైవేటీకరణ చేయరాదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. చింతామోహన్ మాట్లాడుతూ తిరుపతి విమానాశ్రయాన్ని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా అంతర్జాతీయ స్థాయికి పునాది వేశారని గుర్తు చేశారు. రాయలసీమలో ఇది ఒకే ఒక అంతర్జాతీయ విమానాశ్రయమని తెలిపారు. దీన్ని అదానీకి అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం ఫైలు సిద్ధం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రావణ, వడివేలు, మురళి, సురేష్ ,శివ, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీపై బండి వ్యాఖ్యలు ఆక్షేపణీయం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), జూలై 12(ఆంధ్రజ్యోతి): టీటీడీ గురించి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆక్షేపిస్తున్నామని వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఒక ప్రకటనను శనివారం వీడియో ద్వారా విడుదల చేశారు. టీటీడీలో వెయ్యిమందికి పైగా అన్యమత ఉద్యోగులు ఉన్నారని బండి సంజయ్ చెప్పడం సరికాదని, వారిని తొలగించాలంటూ హెచ్చరించడాన్ని తప్పుబట్టారు. ఈ వ్యాఖ్యలు శ్రీవారి ఆలయంపై దాడిలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల వెనుక కుట్ర దాగి ఉందన్న అనుమానం కలుగుతోందని తెలిపారు. టీటీడీని ప్రక్షాళన చేస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం బండి వ్యాఖ్యలను సమర్థించడం సరికాదని పేర్కొన్నారు.

తిరుమలలో సర్వే చేసి అన్యమతస్థులుంటే తొలగిద్దాం

● భూమనకు భానుప్రకాష్‌రెడ్డి సవాల్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 12(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలో ఇంటింటి సర్వే చేద్దాం... ఎవరి ఇళ్లలోనైనా అన్య దేవుళ్ల సాహిత్యం, చిత్రపటాలు కనిపించినా ఆ ఉద్యోగులను టీటీడీ ఉద్యోగాల నుంచి తొలగిద్దాం... మీరు సహకరిస్తారా' అని మాజీ ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆ మేరకు ఆయన శనివారం ఓ వీడియో విడుదల చేశారు. టీటీడీలో వెయ్యిమంది అన్యమతస్తులు ఉన్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల వెనుక కుట్ర దాగి ఉందని భూమన పేర్కొనడాన్ని భానుప్రకాష్‌రెడ్డి ఖండించారు. '2019 నుంచి 2024 వరకు హిందూ వ్యతిరేక ప్రభుత్వం రాజ్యమేలింది. ఓ నాస్తికుడు టీటీడీ చైర్మన్‌గా వ్యవహరించారు. హిందూ ఆలయాలు, పవిత్ర రథాలపై దాడులు జరిగాయి. టీటీడీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా భారీ అవినీతికి పాల్పడ్డారు' అంటూ ధ్వజమెత్తారు. తిరుమలలో కొందరు పేరుకు రాముడు, కృష్ణుడుగా ఉన్నారు గాని వారి ఇళ్లలో మాత్రం ఏసు చిత్రపటాలు ఉంటున్నాయన్నారు. కరుణాకరరెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇంటింటి సర్వేకు అంగీకరించి తమకు సహకరించాలని కోరారు.

క్రీడల్లో పతకాలు సాధించిన టీటీడీ వీఎస్వోలకు అభినందన



తిరుమల, జూలై12(ఆంధ్రజ్యోతి): ఇటీవల అమెరికాలో జరిగిన ప్రపంచ పోలీసు క్రీడల్లో బంగారు, కాంస్య పతకాలను సాధించిన టీటీడీ విజిలెన్స్ వీఎస్వోలను టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం అభినందించారు. తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పతకాలను చూపించారు. టీటీడీ ప్రతిష్ఠను మరింత పెంచేలా విజయం సాధించినందుకు వారిని చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు.

జీవన మార్గాన్ని ఉపదేశించిన శ్రీమద్భగవద్గీత గజల్ గానం

● గజల్ గానంతో ఆహూతులను మంత్రముగ్ధులను చేసిన గజల్ శ్రీనివాస్



గజల్స్ గానం చేస్తున్న గజల్ శ్రీనివాస్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, నైతిక జీవన మార్గాన్ని ఉపదేశించేలా శ్రీమద్భగవద్గీత సారాన్ని ప్రఖ్యాత గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ తన స్వరంలో ఒలికించారు. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో 'శ్రీమద్భగవద్గీత' గజల్ గానం నిర్వహించారు. భగవద్గీతలోని శ్లోకాలను రాగయుక్తంగా ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఎంతో సాంస్కృతిక వైభవం గల తిరుపతిలో ఇటువంటి కార్యక్రమాన్ని మరింత సాంస్కృతిక శోభను తెస్తాయని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని కోరారు. టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ తిరుపతిలో జీవించడమే గొప్ప అదృష్టమన్నారు. పవిత్రమైన తిరుపతిలో ఇటువంటి కార్యక్రమాలు మరింత మంచి వాతావరణాన్ని కలుగ చేస్తాయన్నారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా తిరుపతి కేంద్రంగా అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉందన్నారు. ఈ క్రమంలో భగవద్గీతను గజల్ శ్రీనివాస్ నోట వినడం గొప్పగా ఉందన్నారు. గజల్ శ్రీనివాస్ ఆలపించిన గజల్ ఆడియో పెన్‌డ్రైవ్‌ను ఆవిష్కరించారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దుబాల బృందం ప్రదర్శించిన అష్టలక్ష్మీ వైభవం అత్యద్భుతంగా సాగింది. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్, ఉమా ముద్దుబాల, ఇతర అతిథులను అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గౌరవ కార్యదర్శి పాండ్ర సురేంద్ర నాయుడు సత్కరించారు. సభను ఆకెళ్ల విభీషణశర్మ సమన్వయం చేశారు. పలువురు కళాకారులు, కళాభిమానులు, నగర వాసులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మీ వైభవం నృత్య రూపకంలో ఉమా ముద్దుబాల బృందం

తిరుపతిలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

● పార్కింగ్ నిబంధనలపై ప్రైవేటు వాహనాల యజమానులకు సూచనలు

● అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిక

తిరుపతి(నేరవిభాగం), జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీలు భక్తవత్సలం, రామకృష్ణమాచారి, సీఐలు, రిజర్వు బలగాలు, ఎస్టీఎఫ్ ఫోర్సుతో కలిసి నగరంలోని 10 ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పూర్ణకుంభం సర్కిల్ నుంచి భారతి బస్టాండు వద్దకు నడుచుకుంటూ వెళ్లారు. ప్రైవేటు బస్సులు రోడ్డుపై ఇష్టమొచ్చినట్లు పెట్టడంతో అసహనం వ్యక్తం చేశారు. పద్ధతిలో పెట్టుకునే విధంగా చూడాలని ఆదేశించారు. అక్కడి నుంచి ట్రావెల్స్ ఆఫీసుల వద్దకు వెళ్లి మేనేజర్లను పిలిపించి బస్సులను ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా పెట్టవద్దని సూచించారు. అక్కడే నడి రోడ్డుపై ఆపి ఉన్న ఆటోను పరిశీలించి ట్రాఫిక్ సీఐను పిలిచి జరిమానా వేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఆటోలను పరిశీలించారు. ఆటోలకు డిజిటల్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ రామకృష్ణమాచారిని ఆదేశించారు. బస్టాండులో కొందరు ప్రయాణికులతో ముచ్చటించారు.



ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిమ్మినాయుడుపాలెంలో సమస్యలపై ఆరా

తిమ్మినాయుడుపాళానికి వెళ్లిన ఎస్పీ స్థానికులతో ముచ్చటిస్తూ పోలీసు శాఖ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఆకతాయిల ఆగడాలు, పోలీసులు రాత్రి గస్తీలపై అడిగి తెలుసుకున్నారు. డ్రోన్‌లతో మందుబాబులు, యువత, రౌడీలు, అకతాయిలు భయపడుతున్నారని, ఊరు ప్రశాంతంగా ఉందని స్థానికులు వివరించారు. అవిలాల, చంద్రగిరి, జీవకోన, ఎస్టీవీనగర్, మంగళం, తిరుచానూరు ప్రాంతాల్లో తనిఖీలు చేసి ప్రజలకు భరోసా కల్పించారు. దాదాపు రెండు గంటల పాటు తనిఖీలు చేశారు.